E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు    జాతీయ తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో

పని చేయుటకు నియోజకవర్గాలవారీగా

విలేకరులు కావలెను వాట్సాప్ నెం :

9959812941-9949356387



PUBLISHED: TELANGANA    సంపుటి :01    సంచిక :166    సోమవారం 25 మే 2026    ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్    పేజీలు: 08    వెల :05/-


# జగన్ రక్తచరిత్ర

## అందరికీ తెలుసు : మంత్రి నారాయణ




# విజయవాడలో MSME గ్రోత్ సమ్మిట్ 2026




**న్యూస్ డెస్క్, 24 మే (తెలుగు గళం):** రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగాన్ని మరింత బలోపేతం చేయడమే కాకుండా.. MSME రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేయనుంది. ఈ క్రమంలో సోమవారం విజయవాడలో MSME గ్రోత్ సమ్మిట్ 2026ను నిర్వహించేందుకు సిద్ధమైంది. సీఎం చంద్రబాబు నాయుడు ఈ సదస్సుకు హాజరై.. రాష్ట్రంలో 38 MSME పార్కులకు శంకుస్థాపన చేయనున్నట్లు ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహా.. MSME శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, పలువురు మంత్రులు, పారిశ్రామిక వేత్తలు ఈ సమ్మిట్ కు హాజరుకానున్నారు. సమ్మిట్ లో మీావీజుల బలోపేతానికి ప్రభుత్వం చేపట్టే చర్యలు, ఇప్పటి వరకూ సాధించిన విజయాలపై చర్చించనున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో 'రూరల్ టెక్నాలజీ యాక్షన్ గ్రూప్'

గ్రామీణ యువతలో నవకల్పనలు, సాంకేతిక ఆధారిత ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రఖ్యాత 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్' మార్గదర్శకత్వంలో.. కుప్పం, మంగళగిరి, పిఠాపురం నియోజకవర్గాల్లో 'రూరల్ టెక్నాలజీ యాక్షన్ గ్రూప్ స్మార్ట్ విలేజ్ సెంటర్' ఎక్స్‌టెన్షన్ హబ్‌లను ప్రభుత్వం ప్రారంభించనుంది.

200 కోట్లతో కామన్ ఫెసిలిటీ సెంటర్లు

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 45 పారిశ్రామిక క్లస్టర్లలో రూ.200 కోట్ల వ్యయంతో 'కామన్ ఫెసిలిటీ సెంటర్ల' ఏర్పాటుకు నిధులు విడుదల చేయనున్నారు. ఈ సదస్సు ముఖ్యంగా యువత, మహిళా పారిశ్రామికవేత్తలకు సరికొత్త అవకాశాలను సృష్టించడంపైనే ప్రధానంగా దృష్టి సారించనుంది.

మెటా, అమెజాన్‌లతో భాగస్వామ్యం

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల డిజిటల్ వృద్ధిని పెంపొందించడంతో పాటు, అంతర్జాతీయ మార్కెట్లకు వీరికి ప్రాప్యత కల్పించేందుకు ప్రభుత్వం వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ప్రసిద్ధ గ్లోబల్ టెక్ దిగ్గజాలు 'మెటా', 'అమెజాన్' సంస్థలతో భాగస్వామ్య ఒప్పందాలను కుదుర్చుకోనున్నట్లు ప్రభుత్వం తన ప్రకటనలో వెల్లడించింది.

## పాకిస్తాన్‌లో రక్తపాతం


### జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై బీఎల్ఏ దాడి.. 23 మంది దుర్మరణం




**న్యూస్ డెస్క్, 24 మే (తెలుగు గళం):** పాకిస్తాన్ మరోసారి బాంబుల మోతతో దద్దరిల్లింది. పాకిస్తాన్ బలూచిస్తాన్ ప్రావిన్స్ రాజధాని క్వెట్టాలో భారీ ఆత్మాహుతి దాడి జరిగింది. జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు టార్గెట్‌గా బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) దాడికి పాల్పడింది.బీఎల్ఏకు చెందిన మజీద్ బ్రిగేడ్ ఈ దాడి చేసినట్లు తెలుస్తోంది.

# ఎబోలా కలకలం

## ఏపీ విమానాశ్రయాల్లో హై అలర్ట్




# గ్రేటర్ టు అసెంబ్లీ

## కేటీఆర్ ఎన్నికల స్కెచ్ ఇదే: గులాబీ శ్రేణుల్లో జోష్

**న్యూస్ డెస్క్, 24 మే (తెలుగు గళం):** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలపై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) అత్యంత కీలక వ్యాఖ్యలు చేశారు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికలు వచ్చే డిసెంబర్ నెలలోనే నిర్వహించే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులు, నాయకులు ఇప్పటి నుంచే ఎన్నికల రణరంగానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్లోని తెలంగాణ భవన్లో జరిగిన ముఖ్య ' నాయకుల సమావేశంలో కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ నగరం ఎప్పుడూ బీఆర్ఎస్ పార్టీకి కంచు కోట అని గుర్తు చేసిన కేటీఆర్, రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించి తీరాలన్నారు.




## కొత్త ఉపాధి చట్టం ముసాయిదా రెడీ

### ఆ రాష్ట్రాలకు భారీగా నిధులు




**న్యూస్ డెస్క్, 24 మే (తెలుగు గళం):** దేశంలో దశాబ్దాలుగా అమల్లో ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకురానున్న కొత్త చట్టం 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ ఆజీవికా మిషన్' (వీబీ-జీ రామ్) కీలక దశకు చేరుకుంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఈ కొత్త చట్టానికి సంబంధించిన నిబంధనల ముసాయిదాను తాజాగా విడుదల చేసింది.

### ఇక వారిని మన దరిదాపుల్లోకి రానివ్వొద్దు

## కాంగ్రెస్‌పై డీఎంకే ఫైర్




# రైతులకు సర్కార్ అండ

- మొక్కజొన్న కొనుగోళ్లకు భారీ నిధులు
- అదనంగా రూ.1800 కోట్ల విడుదల
- రైతుల కోసం ప్రభుత్వ బిగ్ స్టెప్
- ప్రతి గింజా కొనుగోలు చేస్తాం
- దళారుల దోపిడీకి చెక్
- రైతులకు గిట్టుబాటు ధర గ్యారెంటీ
- రూ.5800 కోట్లతో కొనుగోళ్లు
- జొన్న రైతులకు భారీ ఊరట
- పొద్దుతిరుగుడు రైతులకు గుడ్‌న్యూస్
- కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఆదేశాలు
- తూకాల్లో మోసాలకు నో ఛాన్స్
- రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- మార్కెట్ పతనానికి సర్కార్ కౌంటర్
- అన్నదాతల కోసం ప్రభుత్వం రంగంలోకి



**న్యూస్ డెస్క్, 24 మే (తెలుగు గళం):** తెలంగాణలో అన్నదాతలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత సీజన్‌లో రాష్ట్రంలో పండిన వివిధ పంటల కొనుగోళ్లపై కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వమే రంగంలోకి దిగింది. రాష్ట్రంలో ఈ ఏడాది మొక్కజొన్న పంట భారీగా దిగుబడి వచ్చిన నేపథ్యంలో మార్కెట్లో ధరలు పతనమై రైతులు నష్టపోకుండా ఉండేందుకు మొక్కజొన్నను రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పంటల కొనుగోలు ప్రణాళికను, దానికి సంబంధించిన నిధుల వివరాలను అధికారికంగా వెల్లడించారు.

రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం, సంక్షోభంలో ఉన్న రైతును గట్టెక్కించడమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ అడుగులు వేస్తోంది. మొక్కజొన్న కొనుగోళ్ల కోసం గతంలోనే కేటాయించిన రూ. 4 వేల కోట్ల నిధులకు తోడు, ప్రస్తుత దిగుబడుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సీఎం రేవంత్ రెడ్డి అదనంగా మరో రూ. 1800 కోట్లను తక్షణమే కేటాయించినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. దీనివల్ల మొత్తం రూ. 5800 కోట్లతో మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ ఎలాంటి అంతరాయం లేకుండా సాగనుంది. మద్దతు ధర దక్కక రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ఉండేందుకే ప్రభుత్వం ఈ భారీ వ్యయాన్ని భరిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వమే నేరుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయటం వల్ల గిట్టుబాటు ధర లభించి, రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.


మిగతాది 2 లో..

# గ్రేటర్ టు అసెంబ్లీ..కేటీఆర్ ఎన్నికల స్కెచ్ ఇదే: గులాబీ శ్రేణుల్లో జోష్

మొదటి పేజీ తరువాయి




"డిసెంబర్లో గ్రేటర్ ఎన్నికలు ముగిసిన తర్వాత.. మరో ఏడాది కాలంలోనే రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు రాబోతున్నాయి. ఈ ఎన్నికలు మనకు అత్యంత కీలకం. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వందకు వంద శాతం తెలంగాణలో మనదే అధికారం, బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ రావడం ఖాయం" అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

ఎన్నికలను తేలిగ్గా తీసుకోవద్దు..

మున్సిపల్ ఎన్నికలు స్థానిక సంస్థలకు సంబంధించినవి అయినప్పటికీ.. ఏమాత్రం నిర్లక్ష్యం వహించకూడదని నాయకులను కేటీఆర్ హెచ్చరించారు. కార్పొరేషన్ ఎన్నికలను సులువుగా తీసుకోవచ్చని భావించవద్దని, ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో కష్టపడాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గతంలో సాధించిన స్థానాల కంటే ఈసారీ అంతకు మించి అత్యుత్తమ ఫలితాలు సాధించడమే మన లక్ష్యంగా పని చేయాలని దిశా నిర్దేశం చేశారు. పార్టీ కోసం క్షేత్రస్థాయిలో అహర్నిశలు శ్రమించే కార్యకర్తలకు, నాయకులకు ఈ ఎన్నికల్లో పూర్తి ప్రాధాన్యత ఉంటుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు. "పార్టీని నమ్ముకుని, ప్రజల్లో ఉంటూ కష్టపడే వారిని బీఆర్ఎస్ పార్టీ కచ్చితంగా గుర్తిస్తుంది. వారికి తగిన సమయం వచ్చినప్పుడు పదవులు, ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలు కల్పిస్తాం" అని ఆయన హామీ ఇచ్చారు.

# జగన్ రక్తచరిత్ర అందరికీ తెలుసు : మంత్రి నారాయణ

**న్యూస్ డెస్క్, 24 మే (తెలుగు గళం):** వైఎస్ జగన్ కుటుంబానికి ఉన్న రక్త చరిత్ర గురించి రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని మంత్రి నారాయణ విమర్శించారు. ఆదివారం నెల్లూరు జిల్లాలో పర్యటించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. వైఎస్ కుటుంబ రక్త చరిత్ర రాష్ట్ర ప్రజలకు తెలియడం వల్లే వైసీపీని 11 సీట్లకు పరిమితం చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆ 11 సీట్లు కూడా మిగలవని మంత్రి నారాయణ జోస్యం చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ, అభివృద్ధి పథకాలకు కేటాయించిన నిధులను ఎందుకు వినియోగించలేదో జగన్ సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన స్వచ్ఛ భారత్ నిధులను కూడా జగన్ సర్కార్ దారి మళ్లించిందని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నో మంచి పనులు చేస్తోంటే.. ఉద్దేశపూర్వకంగానే జగన్ అండ్ కో అసత్యాలను ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇక టీడీపీ అధిష్ఠానం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహానాడు వేడుకలకు ఏర్పాట్లు జరుగుతున్నాయని, ఈసారి వర్చువల్ గా వేడుకలు జరుగుతాయని మరోసారి గుర్తుచేశారు. వర్చువల్ మహానాడులోనూ రాజకీయ తీర్మానాలు, ఆమోదాలు ఉంటాయని తెలిపారు.

# కొత్త ఉపాధి చట్టం ముసాయిదా రెడీ ఆ రాష్ట్రాలకు భారీగా నిధులు

మొదటి పేజీ తరువాయి

వచ్చే జులై 1వ తేదీ నుంచి ఈ కొత్త ఉపాధి హామీ చట్టం దేశవ్యాప్తంగా అధికారికంగా అమలులోకి రానుంది. ఈ లోగా



భాగస్వామ్య పక్షాలు, నిపుణులు, రాష్ట్ర ప్రభుత్వాలు, సాధారణ ప్రజల నుంచి అభిప్రాయాలు, అభ్యంతరాలను స్వీకరించేందుకు కేంద్రం గడువు విధించింది. ఈ ముసాయిదాపై జూన్ 21వ తేదీ వరకు అభిప్రాయాలను సేకరించనున్నారు.

16వ ఆర్థిక సంఘం సూత్రాల ప్రకారం నిధుల పంపిణీ..

కొత్త చట్టం ప్రకారం రాష్ట్రాలకు కేంద్ర నిధుల కేటాయింపుల్లో భారీ మార్పులు చోటు చేసుకోనున్నాయి. 16వ ఆర్థిక సంఘం నిర్దేశించిన క్షితిజసమాంతర బదిలీ సూత్రాల ఆధారంగా నిధులను పంపిణీ చేయనున్నారు. రాష్ట్రాల జనాభా, తలసరి ఆదాయం ఆధారంగా కేంద్ర నిధుల కేటాయింపులు జరుగుతాయి. ఈ నూతన విధానం వల్ల పెద్ద రాష్ట్రాలతో పాటు, ఆర్థికంగా వెనుకబడిన పేద రాష్ట్రాలకు కేంద్రం నుంచి భారీగా నిధులు పెరగనున్నాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న ఈ-కేవైసీ పూర్తయిన పాత జాబ్ కార్డులు కొత్త కార్డులు వచ్చే వరకు తాత్కాలికంగా చెల్లుబాటు అవుతాయి. పాత చట్టం కింద కొనసాగుతున్న పనులన్నీ జులై 1 నుంచి ఆటోమేటిక్‌గా కొత్త చట్టం పరిధిలోకి బదిలీ అవుతాయి.

# ఇక వారిని మన దరిదాపుల్లోకి రానివ్వొద్దు.. కాంగ్రెస్ పై డీఎంకే ఫైర్



**న్యూస్ డెస్క్, 24 మే (తెలుగు గళం):** తమిళనాడులో విజయ్ ప్రభుత్వానికి మద్దతు విషయంలో డీఎంకే, కాంగ్రెస్ మధ్య ఉన్న లాంగ్ టర్మ్ ఫ్రెండ్ షిప్?కు బ్రేక్ పడిన సగతి తెలిసిందే. విజయ్ ప్రభుత్వానికి మద్దతు విషయంలో కాంగ్రెస్ ఏకపక్షంగా వ్యవహరించిందని ఆగ్రహంతో రగిలిపోతున్న డీఎంకే మరోసారి కాంగ్రెస్ పార్టీపై ఎటాక్ చేసింది. తాజాగా జరిగిన పార్టీ మీటింగ్ లో డీఎంకే ముఖ్యనేత ఉదయనిధి స్టాలిన్ విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ నాయకులకు కనీస కృతజ్ఞత, మర్యాద కొరవడిందని మండిపడ్డారు. డీఎంకే ఇకపై కాంగ్రెస్‌ను ఎన్నటికీ విశ్వసించకూడదని, కనీసం ఆ పార్టీని మన దరిదాపుల్లోకి కూడా రానివ్వొద్దని సంచలన వ్యాఖ్యలు చేశారు.

మా వల్లే మీకు ఐదు సీట్లు:

కాంగ్రెస్ ఐదుగురు ఎమ్మెల్యేలను గెలవడానికి డీఎంకే కార్యకర్తలే కారణం అని ఉదయనిధి స్టాలిన్ అన్నారు. ఎంకే స్టాలిన్ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు వారికి ఓటు వేశారని కానీ ఈరోజు కొన్ని పదవుల కోసం మాకు సమాచారం ఇవ్వకుండా పారిపోయారని దుయ్యబట్టారు. తమిళనాడు ప్రజలు అతి త్వరలోనే వారికి తగిన గుణపాఠం నేర్పిస్తారన్నారు. తమ మిత్రపక్షాల కష్టార్జితంపై బతుకుతున్న కాంగ్రెస్ పార్టీని వెన్నుపోటుదారులు, జలగలతో అభివర్ణించారు.

బీజేపీ ఎదుగుదలకు కాంగ్రెస్సే కారణం:

భారతదేశవ్యాప్తంగా బీజేపీ విజయానికి ప్రధాని మోడీ, అమిత్ షా కారణమని నేను భావించాను. కానీ భారతదేశంలో బీజేపీ ఎదుగుదలకు కాంగ్రెస్ కారణమని ఇప్పుడు స్పష్టమైందని ఉదయనిధి అన్నారు. గత పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో మా నాయకుడు ఎంకే స్టాలిన్ కాంగ్రెస్‌ను తన భుజాలపై మోశారన్నారు.

# పాకిస్తాన్‌లో రక్తపాతం..జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై బీఎల్‌ఏ దాడి.. 23 మంది దుర్మరణం

మొదటి పేజీ తరువాయి




రైల్వే ట్రాక్ సమీపంలో జరిగిన ఈ పేలుడులో కనీసం 23 మంది మరణించగా, 53 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ పేలుడుతో రైలు బోగీ పూర్తిగా ధ్వంసమైంది. పట్టాల వెండి ఉన్న అనేక ఇళ్లు, వాహనాలు దెబ్బతిన్నాయి.

చమన్ గేట్ సమీపంలో ఆదివారం ఉదయం ఈ దాడి జరిగింది. క్వెట్టా కంటోన్మెంట్ నుంచి సైనిక సిబ్బందిని తీసుకెళుతున్న సమయంలో దాడి జరిగింది. మరణించిన వారిలో పాక్ ఆర్మీకి చెందిన వారే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. సంఘటన జరిగిన వెంటనే రెస్క్యూ బృందాలు, అధికారులు చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడిన వారిలో చాలా మంది పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఆత్మాహుతి దాడికి తామే బాధ్యులమని బలూచ్ లిబరేషన్ ఆర్మీ ప్రతినిధి జియాండ్ బలూచ్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు.

గతంలో కూడా ఈ జాఫర్ ఎక్స్‌ప్రెస్ టార్గెట్‌గా బలూచ్ వీరులు దాడులకు పాల్పడ్డారు. ఏకంగా ఈ రైలునే హైజాక్ చేసి, పాక్ ఆర్మీ అధికారుల్ని ఊచకోత కోశారు. క్వెట్టా నుంచి పెషావర్ ప్రయాణించే ఈ రైలులో చాలా మంది ఆర్మీ, ఇంటెలిజెన్స్ అధికారులు ప్రయాణిస్తుంటారు. దీంతో చాలా సార్లు బీఎల్‌ఏ ఈ రైలును టార్గెట్ చేస్తోంది. తాజాగా జరిగిన సంఘటనపై అధికారులు విచారణ చేస్తున్నారు.

# ఎబోలా కలకలం ఏపీ విమానాశ్రయాల్లో హై అలర్ట్

**న్యూస్ డెస్క్, 24 మే (తెలుగు గళం):** ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న ఎబోలా వైరస్ ముప్పుపై రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా స్పందించింది. ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా విమానాశ్రయాల్లో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ గట్టి నిఘా ఏర్పాటు చేసింది. ప్రధానంగా ఎబోలా తీవ్రత ఎక్కువగా ఉన్న కాంగో, ఉగాండా దేశాల నుంచి వచ్చే అంతర్జాతీయ ప్రయాణికులను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులు నిర్ణయించారు.




విమానాశ్రయాలలో హెల్త్ డెస్క్‌లు


ఇందుకోసం రాష్ట్రంలోని కీలక నగరాలైన విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయాలలో ప్రత్యేక హెల్త్ డెస్క్‌లను ఏర్పాటు చేసి, వైద్య పరీక్షలను ప్రారంభించారు. ఆయా దేశాల నుంచి వచ్చే ప్రయాణికులలో ఎబోలా లక్షణాలు ఉన్నాయా లేదా అనే కోణంలో స్క్రీనింగ్ నిర్వహిస్తున్నారు. అనుమానిత లక్షణాలు కనిపిస్తే వెంటనే వారిని ఐసోలేషన్‌కు తరలించేలా ఏర్పాట్లు పూర్తి చేశారు.

అన్ని జిల్లాల వైద్య అధికారులకు ఆదేశాలు

రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఈ వ్యవహారంపై అన్ని జిల్లాల వైద్య అధికారులను అప్రమత్తం చేస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారు. సరిహద్దులతో పాటు విమానాశ్రయాల వద్ద నిరంతర నిఘా కొనసాగించాలని, ఎక్కడా నిర్లక్ష్యానికి తావులేకుండా నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అన్ని రకాలుగా సిద్ధంగా ఉందని మంత్రి సత్య కుమార్ పేర్కొన్నారు.

# ప్రతి దేశంలోనూ మూర్ఖులు ఉంటారు

## భారత పర్యటనలో మార్కో రూబియో సంచలన వ్యాఖ్యలు



**న్యూస్ డెస్క్, 24 మే (తెలుగు గళం):** ప్రపంచవ్యాప్తంగా వాషింగ్టన్‌కు న్యూఢిల్లీ అత్యంత ముఖ్యమైన వ్యూహాత్మక భాగస్వాములలో ఒకటిగా ఉందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అన్నారు. భారత పర్యటనలో ఉన్న మార్కో రూబియో, భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో కలిసి న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన సంయుక్త మీడియా సమావేశంలో మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. రెండు ప్రజాస్వామ్య దేశాల మధ్య సంబంధం సంప్రదాయ దౌత్య సంబంధాలకు అతీతమైనదని, ప్రపంచ సవాళ్లపై లోతైన వ్యూహాత్మక ఏకీభావం ఇందులో ప్రతిబింబిస్తుందని రూబియో అన్నారు. ఉగ్రవాదం విషయంలో ప్రపంచ ఉగ్రవాద నెట్‌వర్క్‌ల కారణంగా మన రెండు దేశాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా నష్టపోయాయని దాని ఫలితంగానే ఉగ్రవాద నిరోధక విషయంలో బలమైన పొత్తు మన మధ్య ఏర్పడిందన్నారు.

ప్రతి దేశంలోనూ మూర్ఖులు ఉంటారు:

అమెరికాలో భారతీయులపై జరుగుతున్న జాత్యహంకార దాడులు, వివక్షపై అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా సమాజంలో జాత్యహంకారం ఒక భాగమనే వాదనను ఆయన పూర్తిగా తోసిపుచ్చారు. ప్రపంచంలోని ప్రతి దేశంలోనూ మూర్ఖులు ఉంటారని, అక్కడక్కడ జరిగే కొన్ని ఒంటరి సంఘటనల ఆధారంగా మొత్తం దేశాన్ని అంచనా వేయలేమన్నారు. అమెరికాలో ఉన్న భారతీయ సమాజం అత్యంత విజయవంతమైనదని రూబియో కొనియాడారు. వ్యాపారం, సాంకేతికత, వైద్యం మరియు ప్రజా సేవ వంటి అన్ని రంగాలలో భారతీయ సంతతి నిపుణులు అద్భుతంగా రాణిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అమెరికాలో భారతీయులు అత్యంత విజయవంతమైన, గౌరవప్రదమైన సమాజంగా ఉన్నారని, కేవలం కొందరు వ్యక్తుల అనాగరిక చర్యల వల్ల భారత్-అమెరికా బంధాన్ని తప్పుగా చిత్రీకరించలేమని స్పష్టం చేశారు.

బలపడుతున్న భారత్-అమెరికా బంధం:

ఈ మీడియా సమావేశానికి ముందు ఇరు దేశాల మధ్య రక్షణ సహకారం, వాణిజ్యం, వ్యూహాత్మక సాంకేతికతలు, ఇంధనం మరియు ప్రాంతీయ భద్రతపై విస్తృత స్థాయి చర్చలు జరిగాయి. భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఈ ద్వైపాక్షిక సంబంధాన్ని సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యం గా అభివర్ణించారు.

రాబోయే కొద్ది గంటల్లో ప్రపంచానికి ఒక శుభవార్త:

ఇరాన్‌తో శాంతి ఒప్పందానికి సంబంధించి రాబోయే కొద్ది గంటల్లో ప్రపంచానికి ఒక శుభవార్త అందే అవకాశం ఉందని రూబియో అన్నారు. అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడికి ప్రతిస్పందనగా ఇరాన్ చాలా వరకు దిగ్బంధించిన హోర్ముజ్ జలసంధిపై ఉన్న ఆందోళనలను ఈ కుదురుతున్న శాంతి ఒప్పందం పరిష్కరిస్తుందన్నారు. ఈ ఒప్పందం ఇరాన్ అణ్వాయుధం గురించి ఇకపై భయపడాల్సిన లేదా ఆందోళన చెందాల్సిన అవసరం లేని ప్రపంచానికి మనల్ని చేర్చుతుందన్నారు. కాగా డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో శాంతి ఒప్పందం చాలా వరకు కుదిరిందని వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో రూబియో శుభవార్త వింటారనే మాటలు ఆసక్తిగా మారాయి.

# తెలంగాణను చుట్టేస్తున్న 'కాక్రోచ్ జనతా పార్టీ'.. రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యే అభ్యర్థులు!




**న్యూస్ డెస్క్, 24 మే (తెలుగు గళం):** దేశవ్యాప్తంగా సోషల్ మీడియాను షేక్ చేస్తోన్న 'కాక్రోచ్ జనతా పార్టీ' సెన్సేషన్ ఇప్పుడు తెలంగాణకు పాకింది. నిరుద్యోగ యువతను ఉద్దేశించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చేసిన కొన్ని వ్యాఖ్యలకు నిరసనగా, వ్యంగ్య ధోరణిలో అభిజీత్ దీప్కే అనే యువకుడు ప్రారంభించిన ఈ డిజిటల్ ఉద్యమం.. ఇప్పుడు పెను రాజకీయ తుఫానులా మారుతోంది. కేవలం కొన్ని రోజుల్లోనే ఇన్‌స్టాగ్రామ్‌లో ఏకంగా 20 మిలియన్లకు పైగా ఫాలోవర్లను సాధించి, దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీలకు సైతం దడ పుట్టిస్తోంది. ఈ క్రమంలోనే తెలంగాణ యువత ఈ 'కాక్రోచ్' ట్రెండ్ ను సరికొత్త స్థాయికి తీసుకెళ్తోంది.

నేనే తెలంగాణ సీఎం అభ్యర్థిని..

ఈ సోషల్ మీడియా ఉద్యమంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన ఇర్ఫాన్ అనే యువకుడు నేరుగా సచివాలయం ముందే నిలబడి ఒక వీడియో విడుదల చేయడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. తాను 'తెలంగాణ కాక్రోచ్ జనతా పార్టీ అధ్యక్షుడినని, రాబోయే ఎన్నికల్లో తానే సీఎం అభ్యర్థినని సంచలన ప్రకటన చేశాడు. కేవలం ప్రకటనతోనే ఆగకుండా.. డిజిటల్ జనరేషను ఆకట్టుకునేలా తన మేనిఫెస్టోను కూడా విడుదల చేశాడు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చెట్ల నరికివేతను తక్షణమే నిలిపివేయడం, విద్యార్థులందరికీ ఫీజు రియింబర్స్‌మెంట్‌ను పక్కాగా అమలు చేయడం, నిరుద్యోగులకు కనీస వేతనాలతో కూడిన శాశ్వత ఉద్యోగ అవకాశాలు కల్పించడం, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందించడం, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, నేరాలకు పాల్పడే నిందితులకు జైళ్లలో ఇచ్చే వీఐపీ సౌకర్యాలను పూర్తిగా రద్దు చేయడం వంటి హామీలు ఇచ్చారు.

అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే అభ్యర్థులు..

ఈ సీఎం అభ్యర్థి వీడియో వైరల్ కావడంతో.. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న వివిధ నియోజకవర్గాల యువకులు కూడా రంగంలోకి దిగారు. ఎవరికి వారే తమ సొంత నియోజకవర్గాలకు 'కాక్రోచ్' జనతా పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి'గా ప్రకటించుకుంటూ సోషల్ మీడియాలో పోస్టర్లు, వీడియోలు షేర్ చేస్తున్నారు. సాంప్రదాయ రాజకీయ పార్టీల తీరుపై విసిగిపోయిన యువత, ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను ఒక ఆయుధంగా వాడుకుంటూ పెద్ద ఎత్తున ఫాలో అవుతున్నారు. మొదట ఇదొక సాధారణ మీమ్ లేదా ఆన్లైన్ జోక్ అని భావించినప్పటికీ.. క్షేత్రస్థాయిలో యువత దీనికి కనెక్ట్ అవుతున్న తీరు చూస్తుంటే తెలంగాణలో ఒక సరికొత్త సోషల్ మీడియా రాజకీయ ఉద్యమం మొదలైందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# రైతులకు సర్కార్ అండ మొక్కజొన్న కొనుగోళ్లకు భారీ నిధులు

మొదటి పేజీ తరువాయి



మొక్కజొన్నతో పాటు రాష్ట్రంలో విస్తారంగా పండే జొన్న, పొద్దుతిరుగుడు పంటల కొనుగోలుపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మార్కెట్ ఒడిదొడుకుల నుంచి జొన్న రైతులకు రక్షణ కల్పించేందుకు గాను రూ. 1100 కోట్ల బడ్జెట్‌తో జొన్న కొనుగోళ్లను చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సర్వసన్నద్ధంగా ఉందని మంత్రి వివరించారు. అలాగే సాంకేతిక పరిమితులను పక్కనబెట్టి, పొద్దుతిరుగుడు పంటను నిర్దేశిత 25 శాతానికి మించి కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేశారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. దీనివల్ల నూనెగింజల సాగు చేసిన రైతులకు ఊరట లభించనుంది.

పంట కొనుగోలు ప్రక్రియను క్షేత్రస్థాయిలో వేగవంతం చేసేందుకు గాను జిల్లాల వారీగా తక్షణమే జొన్న, ఇతర పంటల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అందుకు అవసరమైన అన్ని రకాల వసతులను సమకూర్చాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులను మంత్రి ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు త్రాగునీరు, నీడ వంటి కనీస సదుపాయాలు కల్పించాలని ఎక్కడా కూడా అన్నదాతలు గంటల తరబడి వేచి ఉండే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. తూకాల్లో మోసాలు జరగకుండా పారదర్శకంగా కొనుగోళ్లు సాగాలని నిఘా పెంచామన్నారు. రైతుల ప్రయోజనాలే పరమావధిగా పని చేస్తున్న ఈ ప్రభుత్వం ప్రతి గింజా కొనుగోలు చేసే వరకు రైతులకు అండగా ఉంటుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసా ఇచ్చారు.

# ఆ కేసులు ఉపసంహరించుకోండి : మాజీ మంత్రి హరీశ్ రావు



**న్యూస్ డెస్క్, 24 మే (తెలుగు గళం):** జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కూటమి ప్రభుత్వంపై ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో రాజకీయ దుమారం రేపిన విషయం తెలిసిందే. వైసీపీ అధినేత జగన్‌ను అరెస్ట్ చేయాలని పవన్ కల్యాణ్ అమిత్ షాను కోరినట్లు ప్రొఫెసర్ చేసిన వ్యాఖ్యలను జనసేన పార్టీ తీవ్రంగా తప్పుబట్టింది. ప్రొఫెసర్ నాగేశ్వర్ వైసీపీకి తొత్తుగా మారాడంటూ విమర్శలు చేసింది. సోషల్ మీడియాలో ఏకిపారేసింది. అంతేకాదు ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై రాష్ట్రంలో పలువురు జనసేన నేతలు, కార్యకర్తలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ అధినేతను కించపర్చేలా నాగేశ్వర్ మాట్లాడారని ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై కేసులు

దీంతో ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై పలు స్టేషన్లలో కేసులు నమోదు అయ్యాయి. దీంతో ఏపీ, తెలంగాణలో రాజకీయ దుమారం చెలరేగింది. ప్రొఫెసర్ నాగేశ్వర్‌కు పలువురు మద్దతిస్తుంటే కొందరు మాత్రం విమర్శలు చేస్తున్నారు. దీంతో ప్రొఫెసర్ నాగేశ్వర్ తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నారు. అయినా సరే ఆయనపై కేసులు మాత్రం వెనక్కి తీసుకోలేదు. దీంతో పలువురు రాజకీయ నేతలు ప్రొఫెసర్ నాగేశ్వర్ పై పెట్టిన కేసులు ఎత్తివేయాలని కోరుతున్నారు. తాజాగా మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు సైతం స్పందించారు. ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ తాను చేసిన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించినప్పటికీ కక్షపూరిత ధోరణితో కేసులు నమోదు చేసి వేధించడం సరికాదన్నారు. వెంటనే ఈ కేసులను ఉపసంహరించుకోవాలని ఏపీ ప్రభుత్వాన్ని కోరుతున్నానని హరీశ్ రావు పేర్కొన్నారు. హరీశ్ రావు ట్వీట్‌పై ప్రభుత్వ స్పందన ఎలా ఉంటుందో చూడాలి.

## దళిత రత్న అవార్డు గ్రహీత కంతి ప్రవీణ్‌కు ఘన సన్మానం



తెలుగు గళం న్యూస్ జనగామ మే24

నర్మేట మండలం కన్నెబోయిన గూడెం గ్రామానికి చెందిన దళిత రత్న అవార్డు గ్రహీత కంతి ప్రవీణ్‌ను ఆదివారం గ్రామంలో ఘనంగా సన్మానించారు. హంసాత్ ఫౌండేషన్ చైర్మన్ మహమ్మద్ యాకుబ్ పాషా శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామానికి చెందిన యువత ప్రతిభతో గుర్తింపు తెచ్చుకోవడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వర్ధన్నపేట 2వ వార్డులో తీరిన నీటి కష్టాలు.. సొంత ఖర్చుతో కౌన్సిలర్ చొరవ



తెలుగు గళం న్యూస్,వర్ధన్నపేట, మే 24:

వరంగల్ జిల్లా:వర్ధన్నపేట మున్సిపాలిటీ 2వ వార్డు ప్రజల నీటి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది.గత నాలుగు నెలలుగా నీటి సరఫరా సరిగా లేక ఇబ్బందులు పడుతున్న వార్డు ప్రజల విన్నపం మేరకు స్థానిక కౌన్సిలర్ బానోత్ జ్యోతి-నవీన్ యుద్ధ ప్రాతిపదికన స్పందించి సొంత ఖర్చులతో సమస్యను పరిష్కరించారు.బీఆర్ఎస్ కౌన్సిలర్లు గుజ్జ వీరన్న, సిలువేరు కుమారస్వామి యాదవ్, తిరుపతి సురేష్, చిలువేరు రమ-రాజశేఖర్ యాదవ్, తుమ్మల అరుణ-శ్రీధర్ సహకారంతో వెంటనే రంగంలోకి దిగిన కౌన్సిలర్ జ్యోతి-నవీన్ మున్సిపల్ ఏఈతో మాట్లాడి వాటర్ ట్యాంక్ వద్ద పాడైన గేట్ వాల్వ్‌ను మార్పించడంతో పాటు ఇతర సాంకేతిక లోపాలను సరిచేయించారు.వేసవిలో ఉపశమనం మండుతున్న ఎండల కాలంలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవడంపై వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈ కార్యక్రమంలో మేరుగు రాజేష్, గుడిబోయిన సంతోష్,తగరాల విష్ణురావు,మున్సిపల్ సిబ్బంది చల్ల వెంకన్న మరియు వార్డు ప్రజలు పాల్గొని అధికారులకు,కౌన్సిలర్లకు ధన్యవాదాలు తెలిపారు.

## హసన్‌పర్తి పరిధిలోని పాఠశాలల సమీపంలో భారీ అగ్నిప్రమాదం తప్పింది

### ఇన్‌స్పెక్టర్ మహేందర్ సత్వర స్పందనతో అదుపులోకి మంటలు



తెలుగు గళం న్యూస్ హన్మకొండ, మే 24

హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇండియన్ స్కూల్, విహాన్ స్కూల్ ముందు ఉన్న వ్యవసాయ పొలాల్లో ఆదివారం సాయంత్రం భారీగా మంటలు చెలరేగాయి. వరి కొయ్యలు మంటలకు ఆహుతి కావడంతో అగ్నిజ్వాలలు వేగంగా వ్యాపించాయి.సమాచారం అందుకున్న వెంటనే హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఏ. మహేందర్ పోలీస్ బలగాలు, బ్లూ కోట్స్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహకారంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.పోలీసుల సత్వర చర్యలతో సమీపంలోని ఇండియన్ స్కూల్, విహాన్ స్కూల్‌లకు ముప్పు తప్పింది. పెద్ద అగ్నిప్రమాదం సంభవించే అవకాశాన్ని ముందుగానే నివారించగలిగారు.ప్రాథమిక దర్యాప్తులో వ్యవసాయ పొలాల్లో ఉన్న వరి కొయ్యలకు మంటలు అంటుకోవడంతోనే ప్రమాదం జరిగినట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చినట్లు ధృవీకరించారు.



ఘటనకు గల పూర్తి కారణాలపై విచారణ కొనసాగుతోందని, అవసరమైతే సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.ఈ సందర్భంగా ప్రజలకు పోలీసులు పలు సూచనలు చేశారు.పొలాల వద్ద చెత్త, పొడి గడ్డి, ప్లాస్టిక్ వంటి సులభంగా మండే పదార్థాలు పేరుకుపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.ఎక్కడైనా అగ్నిప్రమాదాలు జరిగిన వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా అత్యవసర హెల్ప్‌లైన్ 100, 8712685015 నంబర్లకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## వేం నరేందర్ రెడ్డి ఎన్నిక

# రాష్ట్రానికి గర్వకారణం

ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న నాయకుడు వేం నరేందర్ రెడ్డి

సహనం, చిరునవ్వుతో ముందుకు సాగే నాయకుడు వేం నరేందర్ రెడ్డి

ప్రజాస్వామ్య హక్కులను బీజేపీ విస్మరిస్తోంది

ప్రశ్నించే యువత అకౌంట్ల బ్లాక్ చేయడం బీజేపీ అసహన రాజకీయాలకు నిదర్శనం

దేశంలో జరుగుతున్న అన్యాయాలను రాహుల్ గాంధీ ప్రశ్నిస్తున్నారు

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుంది

రాష్ట్ర అభివృద్ధిలో సీఎం రేవంత్ రెడ్డి రాకెట్ అయితే.. వేం నరేందర్ రెడ్డి నిప్పురవ్వ

వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య

వేం నరేందర్ రెడ్డి సన్మానోత్సవ వేడుకల్లో పాల్గొన్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య




తెలుగు గళం న్యూస్ హన్మకొండ మే24

రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి సన్మానోత్సవ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరంగల్‌కు విచ్చేసిన వేం నరేందర్ రెడ్డి కి ఎంపీ పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు.అనంతరం నిర్వహించిన సభలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ...రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన వెంటనే బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలను నిరసిస్తూ పార్లమెంట్ మెట్లపై జరిగిన ఆందోళనలో వేం నరేందర్ రెడ్డి తమతో కలిసి పాల్గొనడం శుభసూచికమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నిక కావడం రాష్ట్రానికి గర్వకారణమని అన్నారు.ప్రజా సమస్యలపై అవగాహనతో పాటు పార్లమెంటరీ వ్యవహారాల్లో అనుభవం కలిగిన నాయకుడిగా ఆయన సేవలు దేశ స్థాయిలో తెలంగాణ స్వరాన్ని మరింత బలంగా వినిపిస్తాయని పేర్కొన్నారు.దేశ ప్రజలకు ఉన్న ప్రజాస్వామ్య హక్కులను బీజేపీ ప్రభుత్వం విస్మరిస్తోందని ఎంపీ విమర్శించారు."కాక్రోచ్ జనతా పార్టీ" అనే పేరు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతుండగానే ప్రశ్నించే యువత అకౌంట్లను బ్లాక్ చేయించడం బీజేపీ అసహన రాజకీయాలకు నిదర్శనమని అన్నారు.దేశంలో జరుగుతున్న అన్యాయాలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిర్భయంగా ప్రశ్నిస్తున్నారని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతోందని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాకెట్‌లా ముందుకు దూసుకెళుతుంటే, ఆ రాకెట్‌కు నిప్పురవ్వలా వేం నరేందర్ రెడ్డి పనిచేస్తున్నారని కొనియాడారు.చిరునవ్వుతో, సహనంతో, అందరినీ కలుపుకొని ముందుకు సాగే నాయకుడు వేం నరేందర్ రెడ్డి అని పేర్కొన్నారు.భవిష్యత్‌లో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.



వరంగల్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకురావడంలో వేం నరేందర్ రెడ్డి కృషి ఎంతో ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మంత్రులు కొండాసురేఖ, ధనసరి అనసూయ సీతక్క, శాసనసభ్యులు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, జాటోత్ రామ్ చందర్ నాయక్, ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య, కార్పొరేషన్ చైర్మన్లు, జిల్లా పార్టీ అధ్యక్షులు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## మయూరి వైన్స్‌లో మద్యం విక్రయాలపై వినియోగదారుల ఆగ్రహం



తెలుగు గళం న్యూస్ హన్మకొండ మే24

హనుమకొండ జిల్లా బీమదేవరపల్లి మండలం ములకనూర్ గ్రామంలోని మయూరి వైన్స్‌లో మద్యం విక్రయాల విషయంలో అవకతవకలు జరుగుతున్నాయని స్థానిక వినియోగదారులు ఆరోపిస్తున్నారు.ముఖ్యంగా కింగ్‌ఫిషర్ బీర్లను బెల్ట్ షాపులకు తరలిస్తూ, సాధారణ కస్టమర్లకు మాత్రం "బీర్లు లేవు" అని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వైన్స్ వద్దకు వెళ్లిన వినియోగదారులకు ట్యూబోర్గ్, నాక్ ఔట్ వంటి ఇతర బ్రాండ్ల బీర్లను మాత్రమే ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నారని, వారు కోరిన బ్రాండ్లు అందుబాటులో లేవని చెబుతున్నట్లు సమాచారం.అలాగే తెలిసిన వ్యక్తులకు మాత్రమే చల్లని బీర్లు అందిస్తూ, సాధారణ ప్రజలకు "చల్లని బీర్లు లేవు.. ఉంటే తీసుకుపో, లేకపోతే లేదు" అంటూ యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.బార్ షాపులు, బెల్ట్ షాపులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ సాధారణ వినియోగదారులను పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ శాఖ అధికారులు వెంటనే తనిఖీలు నిర్వహించి, నిజానిజాలు వెలికితీయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.




## స్పృహ తప్పిన మహిళకు అండగా నిలిచిన కాజీపేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్



తెలుగు గళం న్యూస్ హన్మకొండ మే24

హనుమకొండలోని హంటర్ రోడ్ డి కన్వెన్షన్ హాల్ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద ఈరోజు మధ్యాహ్నం ఓ మహిళ అకస్మాత్తుగా స్పృహ తప్పి పడిపోయింది. అక్కడ బందోబస్తు విధులు నిర్వహిస్తున్న కాజీపేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకన్న వెంటనే స్పందించి పరిస్థితిని గమనించారు.తక్షణమే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి, స్పృహ తప్పిన మహిళను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకన్న మానవత్వంతో స్పందించిన తీరు పట్ల స్థానికులు అభినందనలు వ్యక్తం చేశారు.

## చెట్టును ఢీకొన్న బైక్.. ఇద్దరు యువకుల మృతి

తెలుగు గళం :సంగారెడ్డి జిల్లా కొండాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో విక్రమ్ (27), అనిల్ (30) మృతి చెందారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.





# దేవస్థాన మాజీ చైర్మన్ తండ్రికి ఆరూరి రమేష్ నివాళి

తెలుగు గళం న్యూస్,ఐనవోలు,మే 24:



వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ఆదివారం ఐనవోలు గ్రామంలో పరామర్శలు చేశారు. ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ మునిగాల సమ్మయ్య తండ్రి కీ.శే. మునిగాల మొగిలి ఇటీవల మరణించగా,వారి నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.అనంతరం గ్రామానికి చెందిన చాగంటి యాదగిరి,పురుషోత్తం తండ్రి వెంకటయ్య ఇటీవల మరణించగా, వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ తంపుల మోహన్, మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు గద్దం రఘువంశీ గౌడ్, సర్పంచ్ ఉస్మాన్ అలీ, మాజీ సర్పంచ్ పల్లకొండ సురేష్, ఉపసర్పంచ్ మజ్జిగ జైపాల్, మాజీ ఉపసర్పంచ్ అడ్డగూడి సతీష్, తండ వెంకన్న, తాటికాయల కుమార్, చింత అశోక్, కొత్తూరి రాజు, కొత్తూరి జాన్సన్, జిందా, చందు తదితరులు పాల్గొన్నారు.

# 3 కోట్ల ఆదాయం..

## కానీ అన్నారం దర్గాలో బస్టాండ్ కరువు



తెలుగు గళం న్యూస్,పర్వతగిరి, మే 24:

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని ప్రముఖ యాత్ర స్థలం అన్నారం యాకుబ్ షావాలి బాబా దర్గాకు వేల సంఖ్యలో భక్తులు వస్తున్నా కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు.దర్గాకు వచ్చే భక్తులకు తాగునీరు, చలివేంద్రాలు,వాష్ రూమ్‌ల సౌకర్యం లేదు. బస్సు కోసం వేచి ఉండేందుకు బస్టాండ్ కూడా లేక ప్రయాణికులు ఎండలోనే రోడ్డుపై నిల్చొని గంటల తరబడి ఇబ్బంది పడుతున్నారు.అన్నారం దర్గాకు ఏటా రూ.3 కోట్ల ఆదాయం వస్తున్నా,గ్రామ పంచాయతీకి ఆదాయం వస్తున్నా బస్టాండ్ నిర్మించలేదని స్థానికులు వాపోతున్నారు.గతంలో బస్టాండ్ కోసం ఊరి అవతల కాంపౌండ్ వాల్ నిర్మించి వదిలేశారని, పనులు ముందుకు సాగలేదని చెబుతున్నారు.దర్గా దగ్గర చెరువుకట్ట మీద ఉన్న మర్రి చెట్టును తొలగించి ఆ స్థలంలో మినీ బస్టాండ్ నిర్మిస్తే బాగుంటుందని అన్నారం గ్రామస్తులు, భక్తులు కోరుతున్నారు.

ఇట్టి విషయాన్ని దర్గా సూపరింటెండెంట్,దర్గా ఇన్స్పెక్టర్, అన్నారం గ్రామ పాలకవర్గం, ప్రభుత్వ అధికారులు గమనించి వెంటనే కొత్త బస్టాండ్ నిర్మించి ప్రయాణికుల సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# రైతులను నిలువు దోపిడి చేస్తున్న పట్టించుకోని ప్రభుత్వం

## : సిపిఐ (ఎం) జిల్లా కమిటీ సభ్యులు- జాజిరి శ్రీనివాస్"



సత్తుపల్లి, ఆర్ సి,మే24(తెలుగుగళం) న్యూస్: వరి ధాన్యం కొనుగోలులో రైతులను నిలువు దోపిడి చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకుండా చోద్యం చూస్తుందని సిపిఐ (ఎం) జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సత్తుపల్లి లోని రావి వీర వెంకయ్య భవనం లో జరిగిన సిపిఎం సత్తుపల్లి మండల కమిటీ సమావేశం అయినంపూడి సనందరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తుందన్నారు. మండల వ్యాప్తంగా రైతుల వరి ధాన్యం కొనుగోలు చేసే విషయంలో నిర్లక్ష్యంగా ఉందన్నారు. ప్రభుత్వం చెప్పే మాటలకు చేసే పనులకు పొంతన లేదన్నారు. వరి కొనుగోలు కేంద్రంలో వరిధాన్యం ఎగుమతి చేయక రెండు నెలలుగా మార్కెట్ యార్డులలోనే రైతులు పడిగాపులు కాస్తున్నారని అన్నారు. మిల్లర్ల యాజమాన్యం ఒక్క లారీ దిగుమతి కోసం ఆరు రోజుల సమయం తీసుకోవడంతో లారీల కొరత ఏర్పడి వడ్ల కొనుగోలు ఆలస్యం జరుగుతుందని అన్నారు. రైతాంగం ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్న అధికారులు రాజకీయ నాయకులుగా ప్రకటనలు ఇస్తున్నారని అన్నారు. వడ్ల కొనుగోలు జరగకపోవడంతో రైతులు వాతావరణ మార్పులతో బెంబేలెత్తుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైస్ మిల్లర్ల యాజమాన్యం వడ్ల కొనుగోలు విషయంలో తీరు మార్చుకోవాలని లారీల కొరత, తరుగు లేకుండా చూడాలని జిల్లా యంత్రాంగం స్పందించి వడ్ల కొనుగోలు వేగవంతం చేపట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి జాజిరి జ్యోతి, మండల కమిటీ సభ్యులు వేపులపాటి కుమారస్వామి, కువ్వారపు లక్ష్మణరావు, యలగం కృష్ణయ్య, తడికమళ్ళ రామకృష్ణ, హసావత్ కృష్ణ, యలగం రాములు, దాట్ల రాంబాబు, బెజవాడ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి ఉద్యమ నేత బెల్లం కార్తీక్‌కు కీలక బాధ్యతలు



తెలుగు గళం న్యూస్ హన్మకొండ/మే 24

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) హనుమకొండ జిల్లా కన్వీనర్‌గా బెల్లం కార్తీక్ నియమితులయ్యారు. కరీంనగర్‌లో జరిగిన తెలంగాణ ప్రాంత అభ్యాస వర్గలో రాష్ట్ర అధ్యక్షులు రావుల కృష్ణ ఈ నియామకాన్ని ప్రకటించారు.గతంలో బెల్లం కార్తీక్ వరంగల్ మహానగర సంయుక్త కార్యదర్శిగా,వరంగల్ విభాగ్ సోషల్ మీడియా కన్వీనర్‌గా,రెండుసార్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా,వరంగల్ మహానగర కార్యదర్శిగా సేవలందించారు.ఈ సందర్భంగా బెల్లం కార్తీక్ మాట్లాడుతూ,బాల్యం నుండి ఆర్ఎస్ఎస్ శాఖకు వెళ్లి జాతీయ భావాలను నింపుకున్నాను. అనునిత్యం దేశం కోసం, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తాను"అని తెలిపారు.తన నియామకానికి సహకరించిన ప్రాంత ప్రముఖ్ బాపురావుకి, వరంగల్ విభాగ్ సంఘటన మంత్రి పృథ్వీరాజ్ కి, విభాగ్ కన్వీనర్ సుజిత్ కి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# విశ్వశాంతి విద్యార్థికి ఎమ్మెల్యే అభినందనలు

## పాలిసెట్ స్టేట్ ఫస్ట్ రావటం సత్తుపల్లి కి గర్వకారణం.

## ఎమ్మెల్యే డా.మట్టారాగమయి దయానంద్.



సత్తుపల్లి, ఆర్ సి,మే24(తెలుగుగళం) న్యూస్: విద్యార్థుల కృషికి ఉపాధ్యాయుల ప్రోత్సాహం, తల్లిదండ్రుల సహకారం తోడైతే వారు అద్భుత ఫలితాలు సాధిస్తారని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 97 వేలమంది పాల్గొన్న పాలీసెట్ ఎంట్రన్స్ పరీక్షలో ఎండి. మహబూబ్అర్భాజ్ అలీ ( విశ్వశాంతి స్కూల్, సత్తుపల్లి ) కి స్టేట్ ఫస్ట్ ర్యాంక్



(120/120 మార్కులు ) రావటం సత్తుపల్లి కి గర్వకారణం అన్నారు .ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారంస్థానిక ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి , రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ దయానంద్ ,సత్తుపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ ఎండి. రెహానా బేగం కమల్ పాషా , సత్తుపల్లి సహకార సంఘ అధ్యక్షులు చల్లగుళ్ల కృష్ణయ్య లు అర్భాజ్ కు స్వీట్లు తినిపించి, శాలువా, పుష్పగుచ్ఛంతో అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్యెల్యే మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ ఎంట్రన్స్ ఫలితాలలో తొలిసారిగాసత్తుపల్లి కి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ రావడం ఆనందంగా ఉందన్నారు. సత్తుపల్లి సత్తా చాటిన అర్భాజ్ అలీతో పాటు , అతని తల్లిదండ్రులను, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను అభినందించారు.అర్భాజ్ అలీ మాట్లాడుతూ...పోటీ పరీక్షలకు విశ్వశాంతి విద్యార్థులు పాల్గొనేలా తమ టీచర్లు ప్రోత్సహించడం వలన పాల్గొన్న ప్రతి పోటీ పరీక్షలో ఏదో ఒక ప్రైజ్ సాధించటం జరుగుతుందని అన్నాడు. విశ్వశాంతి యాజమాన్యం పసుపులేటి నాగేశ్వరరావు, సత్యనారాయణ లు మాట్లాడుతూ... మార్కులు, ర్యాంకులు మాత్రమే ధ్యేయంగా కాకుండా విశ్వశాంతి లో విద్యార్థులకు సబ్జెక్టు పట్ల అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి తండ్రి అఫ్జల్ మాట్లాడుతూ...టీచర్ల సహకారంతో తన కుమారుడికి ఎస్ఎస్సి లో 573 మార్కులు, పాలిసెట్లో ఎంపీసీలో 30 /30 మ్యాథ్స్ లో 60/60, ఫిజిక్స్ లో 30/30,కెమిస్ట్రీలో 30/30 ( మొత్తంగా120/120) మార్కులు సాధించినట్లుతెలిపారు. యంబైపిసి లో ఆరవ ర్యాంక్ సాధించడం జరిగింది అన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనీల్, అవినాష్, క్రిస్టఫర్,పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# మునిగాల మొగిలి పార్థివదేహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి నివాళి



తెలుగు గళం న్యూస్,ఐనవోలు, మే 24

హన్మకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శలు చేశారు.ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ మునిగాల సమ్మయ్య తండ్రి కీ.శే. మునిగాల మొగిలి ఇటీవల మరణించగా,వారి నివాసానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి ధైర్యం చెప్పారు.మాజీ మంత్రి వెంట మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు గడ్డం రఘువంశీ గౌడ్, మాజీ సర్పంచ్ పల్లకొండ సురేష్, పట్టపురం ఎల్లగౌడ్, అడ్డగూడి సతీష్, కొత్తూరి రాజు, చింత అశోక్, కొత్తూరి జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు మంటల్లో కాలి మరణించిన,పంటలు దగ్ధమైన రైతు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

## బి కె యం యు జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు



తెలుగు గళం న్యూస్, పర్వతగిరి / మే 24 :

మంటల్లో ప్రమాదవశాత్తు చిక్కుకొని మరణించిన మరియు ప్రమాదవశాత్తు పంటలు దగ్ధమైన రైతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూపాలపల్లి జయశంకర్ జిల్లా రేగొండ మండలం రేపాక పల్లి గ్రామ రైతు చాగర్ల చంద్రమౌళి భార్య భాగ్య తో కలిసి వరి పొలం కాడికి వెళ్లి గడ్డి తగలబెడుతుండగా గాలికి మంటలు విస్తరించి అందులో చిక్కుకొని సజీవ దహనం కావడం భర్తను కాపాడేందుకు ప్రయత్నించిన భార్య కూడా కాలి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. తల్లిదండ్రులు ఇద్దరు మరణించడంతో ఆ కుటుంబ సభ్యుల రోదనలు అంతా ఇంతా కాదన్నారు. వరిగడ్డి యంత్రాలతో తొలగించాలని ప్రభుత్వ అధికారులు చెబుతున్న చిన్న సన్న కారు రైతులకు అందుబాటులో లేనందున ఇలాంటి ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మొగుళ్ల పెల్లి మండలంలోని ఎల్లారెడ్డి పల్లి, పిడిసిల్ల గ్రామ శివారులో రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్నలకు ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి రైతులు వనపర్తి రమేష్, నైనకంటి కృష్ణారెడ్డి, కదుర్ల రాజిరెడ్డి ,మేకల రాజు లకు చెందిన సుమారు 80 క్వింటాల మక్క జొన్నలు కాలి బూడిద కావడంతో అప్పులు చేసి ఎన్నో వ్యయ ప్రయాసలపడి పండిస్తే చేతికి వచ్చిన పంట దగ్ధమై పోయి విలపిస్తున్నారన్నారు. సకాలంలో మక్కలను ప్రభుత్వం కొనుగోలు చేస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. ఈ అగ్ని ప్రమాదంలో పలువురు రైతుల కరెంటు వైర్లు పైపులు స్టార్టర్లు మోటార్లు దగ్ధం కావడంతో తీవ్రంగా నష్టపోయి బాధపడుతున్నారన్నారు. "ఎద్దు ఏడ్చిన ఎవుసం-- రైతు కన్నీరు పెట్టిన రాజ్యం" బాగుపడినట్టు చరిత్రలో లేదన్న విషయాన్ని పాలకులు గుర్తెరుగాలన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో రెక్కాడితే కానీ డొక్కాడని శ్రమజీవులు రైతు కూలీలు చేతి వృత్తుల వారు ఉపాధి పనులకు లేదా ఇతర పనులకు వెళ్లిన వారు ఎండ వడదెబ్బలకు గురై ప్రతిరోజు పిట్టల్లా రాలి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన రైతు కూలీల కుటుంబాలకు రూ.25 లక్షలుఎక్స్ గ్రేషియో చెల్లించాలని,

అగ్ని ప్రమాదాలతో పంటలు దగ్ధమైన రైతులకు నష్టపరిహారం చెల్లింవి అన్ని విధాలా ఆదుకోవాలని వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# టికెట్ల పేరుతో అన్నారం దర్గాలో అడ్డగోలు వసూళ్లు

**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/మే 24:** వరంగల్ జిల్లా:పర్వతగిరి మండలంలోని ప్రముఖ యాత్ర స్థలం అన్నారం షరీఫ్ హజ్రత్ సయ్యద్ యాకుబ్ షావాలి బాబా దర్గాలో సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని భక్తులు, స్థానికులు ఆరోపిస్తున్నారు.

దర్గాలో సెక్యూరిటీ గార్డులు, స్వీపర్లు,వాచ్‌మెన్‌లు మొత్తం 27 మంది సిబ్బంది ఉండగా,అందులో 10 మంది మాత్రమే విధులకు సక్రమంగా హాజరవుతున్నారని, మిగతావారు డ్యూటీకి రాకున్నా ప్రతినెలా జీతాలు తీసుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హాజరు పర్యవేక్షణలో దర్గా సూపరింటెండెంట్, ఇన్స్పెక్టర్ నిర్లక్ష్యం వల్లే ఇది జరుగుతోందని స్థానికులు చెబుతున్నారు.

భక్తులపై దౌర్జన్యం:

యూనిఫామ్, ఐడీ కార్డులు లేకుండా కొందరు సిబ్బంది హుండీల చుట్టూ గుమిగూడి భక్తులను భయపెడుతున్నారని ఆరోపణ. నైవేద్యం తెచ్చిన భక్తుల నుండి “రూ.1000 ఇస్తేనే దర్శనం” అని దౌర్జన్యం చేస్తున్నారని, కానుకలను హుండీలో వేయకుండా జేబులో వేసుకుంటున్నారని భక్తులు వాపోతున్నారు. ప్రశ్నించిన గ్రామస్తులను బెదిరింపులకు గురిచేస్తున్నారని సమాచారం.



అధిక రేట్ల వసూలు:

ఆర్డర్ కాపీ లేకుండానే యాట కందూరు టికెట్ రూ.300, కోడి కందూరు రూ.100, వెంట్రుకల టికెట్ రూ.50, టూవీలర్ పూజ రూ.150, త్రీవీలర్ రూ.200, ఫోర్ వీలర్ రూ.300, కొబ్బరికాయ టికెట్ రూ.5 చొప్పున వసూలు చేస్తున్నారని ఆరోపణ. కొబ్బరికాయ టికెట్ ఉన్నా ఒక్కో కాయకు అదనంగా రూ.20 వసూలు చేస్తున్నారని, ప్రతి శుక్రవారం 10-15 బస్తాల కొబ్బరి వక్కలను తీసుకెళ్తున్నారని చెబుతున్నారు.

లిసౌకర్యాలు శూన్యం:లిదర్గాకు ఏటా రూ.3 కోట్ల ఆదాయం వస్తున్నా భక్తులకు తాగునీరు,టెంట్లు, కూర్చునేందుకు సిమెంట్ బెంచీల సౌకర్యం లేదు. గతంలో ట్రాఫిక్ నియంత్రణ చేసే సిబ్బంది ఇప్పుడు లేకపోవడంతో శుక్రవారం రోజున వాహనాల రద్దీతో గొడవలు జరుగుతున్నాయని అంటున్నారు. ఈ అక్రమ వసూళ్లను అరికట్టి, సిబ్బంది అందరూ యూనిఫామ్,ఐడీ కార్డులతో విధులకు హాజరయ్యేలా చూడాలని, భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించాలని అన్నారం గ్రామస్తులు, భక్తులు దర్గా సూపరింటెండెంట్, ఇన్స్పెక్టర్,ప్రభుత్వ ఉన్నతాధికారులను కోరుతున్నారు.

# రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డికి మార్నేని దంపతుల శుభాకాంక్షలు



**తెలుగు గళం న్యూస్ హన్మకొండ/మే 24**

రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన తర్వాత మొదటిసారి వరంగల్ నగరానికి విచ్చేసిన వేం నరేందర్ రెడ్డిని మాజీ టీజీ క్యాబ్ & డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు మాజీ ఎంపీపీ మార్నేని మధుమతి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా మార్నేని దంపతులు వేం నరేందర్ రెడ్డి చిత్రపటాన్ని బహూకరించి సత్కరించారు. వీరితో పాటు పాక్స్ వర్ధన్నపేట చైర్మన్ రాజేష్ కన్నా కూడా ఎంపీ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# హమాలి కార్మికులకు వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేయాలి

## మే 30న జనగామ లో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

## సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాపర్తి రాజు,సుంచు విజేందర్



**తెలుగు గళం న్యూస్ జనగామ మే24**

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ప్రైవేటు వివిధ కంపెనీలలో పనిచేస్తున్న 7 లక్షల పైగా ఉన్న హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు లేక బతుకుకు భరోసా లేక అనేకమంది హమాలి ప్రాణాలు గాలులు కలిసిపోతున్నాయని ప్రజల వాడే నిత్యవసర సరుకులను ప్రజలకు అందుబాటులో అందిస్తూ ఆర్థిక రంగంలో కీలకపాత్ర పోషిస్తున్న అమాలి కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి వారి సంక్షేమానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాటుపడాలని సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాపర్తి రాజు సుంచు విజెందర్ లు డిమాండ్ చేశారు. ఆదివారం రోజున అల్ హమాలి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 4వ మహాసభలు జనగామ జిల్లా కేంద్రంలోని గ్లోరి ఫంక్షన్ హాలో జరుగుతున్న మహాసభల కరపత్రాలను సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు.అనంతరం ఏర్పాటుచేసిన సభకు హమాలి యూనియన్ జిల్లా అధ్యక్షులు భైరగోని బాలరాజు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా రాపర్తి రాజు సుంచు విజేందర్ లు పాల్గొని మాట్లాడుతూ హమాలీ కార్మికులు సరుకుల ఉత్పత్తి సరఫరా పంపిణీలో వీరి శ్రమ కీలకమన్నారు.ప్రభుత్వాలు మారిన వీరి బ్రతుకులు మారలేదన్నారు.పని ప్రదేశాలలో అనేకమంది కార్మికులు ప్రమాదాలకు గురై మరణిస్తున్నారని వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రమాదంలో మరణించిన హమాలి కార్మిక కుటుంబాలకు 10 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికుడికి 6000 రూపాయల పెన్షన్ ఇవ్వాలని అన్నారు.సామాజిక భద్రత చట్టం చేయాలని వృద్ధాప్యంలో పనిచేయాలని స్థితిలో ఉన్నా వారికి నెలకు 9000 రూపాయలు ఇవ్వాలన్నారు. అర్హులైన హమాలి కార్మిక కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలన్నారు.ప్రభుత్వం గుర్తింపు కార్డు ఇవ్వాలని ఐకెపి కొనుగోలు కేంద్రాలలో పనిచేస్తున్న హమాలీలకు పని ప్రదేశంలో కనీస సదుపాయాలు కల్పించాలన్నారు హమాలీలకు రేట్లు ప్రభుత్వమే చెల్లించాలన్నారు తాడు మాములు ఇవ్వాలన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా అమాలి కార్మికులు ఎదుర్కొంటున్న అనే సమస్యలను ఈ రాష్ట్ర మహాసభలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు.ఈ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేలా పోరాటాలు రూపకల్పన చేస్తామని పేర్కొన్నారు. మహాసభ విజయవంతనికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా హాజరై సిఐటియూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి హమాలి ఫెడరేషన్ రాష్ట్ర మహాసభ విజయవంతానికి సిఐటియు నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి అన్నబోయిన రాజు జిల్లా కమిటీ సభ్యులు గంగరబోయిన మల్లేష్ రాజ్ కొంగరి నరసింహ యాకయ్య నరసింహులు కుమార్,రాజవ్వ,కోమల,రాజు తదితరులు పాల్గొన్నారు.

# కన్నెబోయిన గూడెంలో మహా రక్తదాన శిబిరం





**తెలుగు గళం న్యూస్ జనగామ మే24**

నర్మేట మండలం కన్నెబోయిన గూడెం గ్రామంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని అంబేద్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో మహా రక్తదాన శిబిరం నిర్వహించారు. మండుటెండలను సైతం లెక్కచేయకుండా యువకులు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు.ఈ రక్తదాన శిబిరంలో సుమారు 28 మంది రక్తదాతలు పాల్గొని తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారు.కార్యక్రమంలో గ్రామ యువకులు, నాయకులు, అంబేద్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు మరియు గ్రామ పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.

# ఏపీని సినీ పరిశ్రమకు రాజధానిగా తీర్చిదిద్దుతాం..!



**తెలుగు గళం :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్ మరియు నాటక అభివృద్ధి సంస్థ కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏపీని తెలుగు సినీ పరిశ్రమకు ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. “ఇది ఒక కొత్త అధ్యాయం ప్రారంభం” అని పేర్కొన్నారు. 1975లో ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రారంభమైందని, రాష్ట్ర విభజన తర్వాత రాజధానిలేని పరిస్థితుల్లో 2017లో ఏపీ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, తాను, ఇంకా మంత్రి కందుల దుర్గేష్ కలిసి సినీ రంగ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో చలనచిత్ర పరిశ్రమకు ఏపీ ఒక ముఖ్యమైన కేంద్రంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలుగు సినిమాలకు వచ్చే కలెక్షన్లలో సుమారు 70% ఆదాయం ఆంధ్రప్రదేశ్ నుంచే వస్తోందని బాలకృష్ణ తెలిపారు. తాను నటించిన ‘అఖండ’ సినిమా షూటింగ్‌ను రంపచోడవరంలో నిర్వహించిన విషయాన్ని ప్రస్తావిస్తూ, రాష్ట్రంలో అద్భుతమైన సహజ సిద్ధమైన లొకేషన్లు ఉన్నాయని చెప్పారు. “నేను చేసినన్ని సినిమాలు ఏపీలో మరెవ్వరూ చేసి ఉండరు” అంటూ వ్యాఖ్యానించారు.

సినిమా షూటింగ్‌లకు సంబంధించిన అన్ని అనుమతులు ఒకే చోట లభించేలా సింగిల్ విండో విధానం తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇందుకు సంబంధించి త్వరలో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను ప్రకటిస్తామని వెల్లడించారు. ప్రస్తుతం షూటింగ్‌లు తగ్గిపోవడంతో సినీ రంగానికి చెందిన అనేక యూనియన్లు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నాయని బాలకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. “సినిమా ఎలా ఉండాలో ఆలోచించే పరిస్థితి పోయి, పరిశ్రమను బ్రతికించాల్సిన పరిస్థితి వచ్చింది” అని అన్నారు.

టెక్నాలజీ రాకముందు సినిమాలు త్వరగా పూర్తయ్యేవని, ఇప్పుడు సాంకేతికత పెరిగినప్పటికీ నిర్మాణం ఆలస్యం అవుతోందని పేర్కొన్నారు. చాలామంది పంపిణీదారులు థియేటర్లకు తాళాలు వేసుకునే పరిస్థితులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. జోడెడ్ల ప్రభుత్వం సినీ ఇండస్ట్రీ అభివృద్ధికి కట్టుబడి ఉంది. తెలంగాణ ప్రభుత్వ సహకారం కూడా కోరుతున్నాం. ఏపీలో తెలుగు చలనచిత్ర పరిశ్రమను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదీ అని బాలకృష్ణ అన్నారు. ఎక్కువ సినిమాలు నిర్మించి, థియేటర్లకు అందించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.

# ‘బాలల మేథోవికాసానికి మంచి కథల పుస్తకాలు అవసరం’



**తెలుగు గళం :** బాలల మేథోవికాసానికి మంచి కథల పుస్తకాలు అవసరమని జిల్లా గ్రంథాలయ సంస్థ ఉప కార్యదర్శి వి.పెద్దక్క అన్నారు. నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కర్నూలుకు చెందిన ప్రముఖ బాలసాహిత్యవేత్త డాక్టర్ ఎం. హరికిషన రాసిన ‘బంగారు మనసు’ పుస్తకావిష్కరణ జరిగింది. ప్రజా గాయకుడు ఎంపీ బసవరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వి. పెద్దక్క పుస్త కాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులు కథల పుస్తకాలు చదవడం వల్ల వారిలో జిజ్ఞాసతోపాటూ ఊహా కల్పన, యోచించే గుణం, ఆలోచనా సరళి పెంపొందుతాయని చెప్పారు. పుస్తక రచయిత డాక్టర్ ఎం. హరికిషన మాట్లాడుతూ విద్యార్థులకు సరళంగా, చిన్న పదాలతో రాసే కథలు ఎంతో ఆకట్టుకుంటాయని, ఆ దిశగా ఈ పుస్త కం విద్యార్థులను చదివిస్తుందని చె ప్పారు. కార్యక్రమంలో రచయితలు గనుమాల మునిస్వామి, పుల్లా రామాం జినేయులు, విజయులు, మా దాల శ్రీనివాసులు, కోలుకొండ వీర నాగేశ్వ రయ్య, రేవుల శ్రీనివాసులు, సి.యాగంటీశ్వరప్పులు పుస్తకంపై సమీక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆలపించిన దేశభక్తి గీతాలు ఆకట్టుకున్నాయి

# చాంబర్ ఆఫ్ కామర్స్ సేవలు అభినందనీయం




**తెలుగు గళం : :** వ్యాపారుల సమస్యల పరిష్కారానికి చాంబర్ ఆఫ్ కామర్స్ చేస్తున్న కృషి అభినందనీయమని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ అన్నారు. ఆదివారం స్థానిక టీజీ వెంకటేశ జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. 1974 నుంచి జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్‌తో తనకున్న అనుబం?ధాన్ని పంచుకున్నారు. రాష్ట్ర ముఖ్యమం త్రిగా నందమూరి తారకరామారావు ఉన్న సమయంలో వస్త్రాలపై వచ్చిన ఎంట్రీ ట్యాక్స్‌కు వ్యతిరేకంగా పోరాడామన్నారు. రాష్ట్ర మంత్రివర్గసమ యం లో కూడా వ్యాపారులకు ఇబ్బందికరంగా మారిన వ్యాట్‌కు వ్యతిరేకంగా పోరాడామన్నారు. కర్నూలు నగరంలో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌కు సం బంధించి సమస్య వచ్చినప్పుడు మంత్రి టీజీ భరత స్పందించి మున్సిపల్ షాపులకు ప్రతి సంవత్సరం ఏడు శాతం ఆదాయం పెంచే విధంగా చూశా రన్నారు. సంస్థ అధ్యక్షుడు విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా చాం బర్ ఆఫ్ కామర్స్ అభివృద్ధికి టీజీ వెంకటేష్ అందిస్తున్న సహకారం మరువ లేనిదన్నారు. కార్యక్రమంలో గౌరవ కార్యదర్శి రత్నప్రసాద్, కార్యదర్శి నరేం ద్ర, ఆర్యవైశ్యమహా సభ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

# అమెరికా చేసుకున్న చెత్త ఒప్పందం అదే: ట్రంప్



**తెలుగు గళం :** అమెరికా చేసుకున్న అత్యంత చెత్త ఒప్పందాల్లో ఇరాన్ అణు ఒప్పందం ఒకటని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. దానిని ఒబామా, ఆయన యంత్రాంగంలోని అనుభవం లేని అధికారులు ప్రతిపాదించి, అమలులోకి తెచ్చారని విమర్శించారు. ఇరాన్ అణ్వాయుధాన్ని అభివృద్ధి చేసుకునే ప్రయత్నాలకు అది వీలు కల్పించిందన్నారు.

తమ హయాంలో ప్రస్తుతం ఇరాన్‌తో జరుపుతున్న ఒప్పందం విషయంలో అలాంటి తప్పిదం జరగదని ట్రంప్ స్పష్టం చేశారు. చర్చలు క్రమబద్ధంగా, నిర్మాణాత్మకంగా సాగుతున్నాయన్నారు. ఒప్పందం విషయంలో తొందరపడొద్దని తమ ప్రతినిధులకు స్పష్టంగా చెప్పినట్లు ట్రంప్ వెల్లడించారు. ఒప్పందం కుదిరి, అంగీకరించి, ఇరుపక్షాలు సంతకాలు చేసే వరకు హర్మూజ్ దిగ్బంధనం పూర్తి స్థాయిలో అమల్లో ఉంటుందన్నారు.

‘మరికొన్ని గంటల్లో గుడ్ న్యూస్’ – రూబియో కీలక వ్యాఖ్యలు


పొరపాట్లకు తావులేకుండా.. సమయం తీసుకొని ఇరుపక్షాలు సరిగ్గా ఒప్పందం చేసుకోవాల్సి ఉందని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్‌తో తమ బంధం ప్రొఫెషనల్‌గా, మరింత ఉత్పాదకంగా మారుతోందన్నారు. అయినప్పటికీ.. అణ్వాయుధాన్ని అభివృద్ధి చేసుకోలేరని లేదా సమకూర్చుకోలేరనే విషయాన్ని వాళ్లు (ఇరాన్) అర్థం చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు తమకు మద్దతు తెలిపిన, సహకారం అందించిన పశ్చిమాసియా దేశాలకు ధన్యవాదాలు తెలియజేయాలనుకుంటున్నట్లు ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ పేర్కొన్నారు.

# మహిళ నాలుక కోసి పారిపోయిన ప్రియుడు



**తెలుగు గళం :** సహజీవనం చేస్తున్న వ్యక్తి.. మహిళ నాలుకను కోసి పారిపోయిన సంఘటన హైదరాబాద్‌లోని కుషాయిగూడ ఠాణా పరిధిలో జరిగింది. ఎస్సై కె.సతీశ్ తెలిపిన ప్రకారం.. కుషాయిగూడకు చెందిన మహిళ (50) భర్త చనిపోయి పదేళ్లైంది. నవీన్ అనే వ్యక్తి పరిచయం కావడంతో ఆరు నెలలుగా అతడితో సహజీవనం చేస్తోంది. ఈ నెల 22న అర్ధరాత్రి ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన నవీన్ చాకుతో మహిళ నాలుకను కోసి పారిపోయాడు. స్థానికులు ఆమెను గాంధీ ఆసుపత్రికి తరలించగా.. వైద్యులు శస్త్రచికిత్స చేశారు. బాధిత మహిళ ప్రస్తుతం కోలుకుంటోంది. ఆమె కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

# ముదిరాజ్ విద్యావంతుల వేదికపై మండిపడ్డ ముదిరాజ్ చైతన్య వేదిక



శేరిలింగంపల్లి :(తెలుగు గళం) : "ముదిరాజ్ విద్యావంతుల వేదిక" పేరుతో ఇటీవల ఏర్పడిన సంఘంపై ముదిరాజ్ చైతన్య వేదిక తీవ్ర విమర్శలు గుప్పించింది. ఇది జాతి చైతన్యం కోసం ఏర్పడిన వేదిక కాదని, కొందరు రాజకీయ నాయకుల ఆత్మరక్షణ కోసం సృష్టించబడిన కుట్రపూరిత వేదిక అని ఆరోపించింది.

గత పది సంవత్సరాలుగా ముదిరాజ్ జాతిపై అన్యాయాలు జరిగినప్పుడు మౌనం వహించిన వ్యక్తులు, ఇప్పుడు అకస్మాత్తుగా జాతి చైతన్యం పేరుతో సభలు నిర్వహించడం వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయని విమర్శించింది. ముఖ్యంగా బండ ప్రకాష్ అనుచర వర్గం ఈ వేదికను నడిపిస్తోందని ఆరోపించింది.

కోకాపేటలో ముదిరాజ్ సమాజానికి కేటాయించిన ఐదు ఎకరాల భూమి కబ్జా వ్యవహారం, మత్స్యకారుల దోపిడీ, బీఆర్ఎస్ పాలనలో ముదిరాజ్‌లకు ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వకపోవడం వంటి అంశాలపై ఈ వేదిక ఇప్పటివరకు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించింది.

ఉస్మానియా, కాకతీయ, పాలమూరు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలలో చదువుతూ జాతి హక్కుల కోసం పోరాడుతున్న నిజమైన ముదిరాజ్ విద్యార్థులు, మేధావులకు ఈ వేదికలో స్థానం ఉందా అని నిలదీసింది. డబ్బు, అధికారానికి దగ్గరగా ఉన్న వారికే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించింది.

ఈటల రాజేందర్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు ఈ సభకు హాజరయ్యే ముందు తమ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేసింది. కోకాపేట భూమి వివాదం, ముదిరాజ్ హక్కుల అంశాలపై స్పష్టమైన అభిప్రాయం చెప్పాలని కోరింది.

"ముదిరాజ్ అధ్యయన వేదిక" వంటి నిజమైన సామాజిక వేదికలు కనుమరుగై, రాజకీయ ప్రయోజనాల కోసం కొత్త వేదికలు పుట్టుకొస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేసింది. జాతిని తప్పుదారి పట్టించే ప్రయత్నాలను ఎప్పటికీ అడ్డుకుంటామని, నిజంగా ముదిరాజ్ సమాజం కోసం పనిచేసే నాయకుల పక్షాన నిలబడతామని ముదిరాజ్ చైతన్య వేదిక స్పష్టం చేసింది.

# శిల్పారామంలో కళల సంబరం



శేరిలింగంపల్లి :(తెలుగు గళం) :మాదాపూర్‌లోని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

కూచిపూడి నాట్య గురువు ఉదయ్ కృష్ణ శిష్య బృందం 'మూషిక వాహన', 'తాండవ నృత్యకారి', 'నామరామాయణం', 'ఒకపరి కొకపరి', 'రామాయణ శబ్దం' అంశాలతో అద్భుతమైన కూచిపూడి నృత్య ప్రదర్శన అందించింది.

ఐశ్వర్య, తన్వి, ఆధ్య, మహీరా, శ్రీనిక, జొశ్విక, దేదీప్య తదితరుల అభినయం ప్రేక్షకులను మెప్పించింది.అనంతరం బెంగళూరు నుంచి విచ్చేసిన శ్రీ నృత్యరంజని ఫైన్ ఆర్ట్స్ అకాడమీ గురువు శాంత కృష్ణ ఆధ్వర్యంలో 'శ్రీరామ చరితం' నృత్య రూపకాన్ని భరతనాట్యంలో ప్రదర్శించారు. అమూల్య, రిషిత, సహస్ర, శ్రితి, శ్రావ్య, బృంద, భవ్య తదితరులు తమ నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

ఈ కార్యక్రమానికి నందకుమార్ గాత్ర సహకారం అందించగా, కృష్ణ బాత్ వేణువు, కార్తీక్ మృదంగం, శ్రీకాంత్ రిథమ్ పాడ్‌పై వాయిద్య సహకారం అందించారు.

# మహానాడు ను విజయవంతం చేయాలి...!!



రావులపాలెం (తెలుగు గళం)మే 24: ఈ నెల 27,28 తేదీల్లో క్లస్టర్ స్థాయిలో జరగనున్న మహానాడును విజయవంతం చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. ఆదివారం రావులపాలెం క్యాంపు కార్యాలయంలో ఆయన తెదేపా నాయకులు, కార్యకర్తలతో మహానాడు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా ఈసారి క్లస్టర్ స్థాయిలో మహానాడు జరుగుతుందన్నారు. నియోజకవర్గం లో, క్లస్టర్ స్థాయిలో చేయాల్సిన పనులను చర్చించుకోవడానికి ఇదొక గొప్ప అవకాశంగా ఆయన అభివర్ణించారు. క్లస్టర్ వారీగా పార్టీని బలోపేతం చేసుకోవడానికి, తెలుగుదేశం పార్టీని స్థానిక ఎన్నికలకు సన్నద్ధం చేయడానికి , క్లస్టర్ పరిధిలో ఈ రెండు సంవత్సరాల కాలంలో జరిగిన మంచి చెడులను చర్చించుకోవడానికి ఈ మహానాడు ద్వారా వీలవుతుందన్నారు. గత వైసిపి ప్రభుత్వ కాలంలో విధ్వంసం జరిగిందని, వ్యవస్థలు కుప్పకూలాయని, వాటి నుంచి కోలుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో పయనింపచేయడానికి గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషిని అందరికీ వివరించాలన్నారు. గ్రామాలను, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో ముందుకు వెళ్తున్నామన్నారు. ప్రజలకు మంచి చేస్తూనే పార్టీని సైతం బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలు అందరు కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. ఈ దఫా 'స్త్రీ శక్తి థీమ్' తో మహానాడును నిర్వహించుకుంటున్నామని, కనుక మహిళలను ఈ కార్యక్రమంలో పాల్గొనేలా పెద్దఎత్తున ప్రోత్సహించాలన్నారు. క్లస్టర్ పరిధిలో ఉన్న కుటుంబ సాధికార సారధి దగ్గరి నుంచి బూత్ ఇంఛార్జ్, గ్రామ పార్టీ అధ్యక్షులు, గ్రామ కమిటీ, క్లస్టర్ కమిటీ సభ్యులు మహానాడులో పాల్గొనాలన్నారు.

# కొండాపూర్‌లో ఘనంగా 'శుభం బ్యాంకెట్ హాల్' ప్రారంభం

## ముఖ్య అతిథిగా పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



బ్యాంకెట్ హాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న గాంధీ.

శేరిలింగంపల్లి (తెలుగు గళం) :కొండాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్ బి బ్లాక్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 'శుభం బ్యాంకెట్ హాల్'ను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.

ఈ సందర్భంగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేసిన గాంధీ, స్థానికులకు మెరుగైన వసతులతో కార్యక్రమాల నిర్వహణకు ఈ బ్యాంకెట్ హాల్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు దేశాల్, సుప్రజ ప్రవీణ్, చాంద్ పాషా, భగవాన్, ఎంవీ రావుతో పాటు పలువురు స్థానికులు పాల్గొన్నారు.

# ప్రశాంత్ నగర్ సమస్యల పరిష్కారానికి గాంధీ హామీ

## అసంపూర్తి రోడ్లు, యూజీడీ పనులు త్వరలో ప్రారంభం



శేరిలింగంపల్లి:(తెలుగు గళం) :హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ కాలనీ వాసులు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీని వివేకానంద నగర్ కార్యాలయంలో కలిసి కాలనీలో నెలకొన్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా అసంపూర్తిగా ఉన్న రోడ్లు, యూజీడీ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు.

దీనిపై స్పందించిన ఆరెకపూడి గాంధీ త్వరలోనే కాలనీలో పర్యటించి సమస్యలను పరిశీలిస్తామని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న రోడ్లు, యూజీడీ పనులను ప్రారంభించి డ్రైనేజీ, మంచినీటి వ్యవస్థలను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. ప్రశాంత్‌నగర్ కాలనీని ఆదర్శ కాలనిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొనే ఏ సమస్య అయినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో నాయకుడు పోతుల రాజేందర్‌తో పాటు కాలనీ వాసులు సుబ్బారావు, రామ్‌ప్రసాద్, బలరాం, ప్రభాకర్ రెడ్డి, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సహాయం కోసం సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



శేరిలింగంపల్లి: (తెలుగు గళం): వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని సప్తగిరి కాలనీకి చెందిన రాజేందర్‌కు వైద్య చికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.2,75,000 ఎల్ఓసీ పత్రాన్ని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ సీఎం సహాయ నిధి పేద ప్రజలకు వరంలా మారిందన్నారు. ప్రజాక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక భరోసా కల్పిస్తోందని తెలిపారు.

సహాయం అందినందుకు బాధిత కుటుంబ సభ్యులు ఆరెకపూడి గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో నాయకుడు మల్లయ్యతో పాటు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# జమ్మలమడుగు రైల్వే స్టేషన్ లో మౌలిక సదుపాయాలు కల్పించాలి.




కడపజిల్లా (తెలుగు గళం) మే 24: జమ్మలమడుగు పట్టణంలోని రైల్వే స్టేషన్ లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్ చేసారు.ఆదివారం నాడు జమ్మలమడుగు లోని స్థానిక ఎన్జీవో కార్యాలయం నందు విలేఖరుల సమావేశంలో శివకుమార్ మాట్లాడుతూ..జమ్మలమడుగు పట్టణంలోని రైల్వే స్టేషన్ లో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు,ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి,ఇబ్బందికి గౌరవుతున్నారు అన్నారు.

ముఖ్యంగా జమ్మలమడుగు రైల్వే స్టేషన్ మీదుగా ఇప్పటికే రెగ్యులర్ గా ధర్మవరం,

మచిలీపట్నం ఎక్స్ ప్రెస్,నంద్యాల రేణిగుంట డెమో,తిరుపతి గుంటూరు ఎక్స్ ప్రెస్,వారంతపు రైళ్లు అరుణాచలం,నాంపల్లి రైళ్లు జమ్మలమడుగు మీదుగా వెళుతున్నాయి,అని మరిన్ని రైళ్లు జమ్మలమడుగు రైల్వే స్టేషన్ మీదుగా వస్తున్నాయని ప్రయాణికులు కూడా ఎక్కువ మంది ప్రయాణిస్తున్నారని అన్నారు.అయితే ఇటువంటి తరుణంలో రైల్వే స్టేషన్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి కానీ అవేవీ కనబడటంలేదన్నారు.ముఖ్యంగా రైల్వే ప్లాట్ ఫామ్ దెబ్బతిని గతుకులుగా ఉన్నదని తద్వారా

ప్రయాణికులు రైలు ఎక్కాలన్నా,దిగాలన్న ప్రమాదకరంగా ఉన్నదని అన్నారు.అందే విధంగా ప్లాట్ ఫామ్ కూడా చిన్నదిగా ఉండటంతో రాత్రి సమయాలలో ప్లాట్ ఫామ్ అవతల రైలు నిలబడితే చీకటిలో ఎక్కే వారికి,రైలు దిగే వారికి ఇబ్బంది ఉన్నదని ప్రమాదాలు కూడా జరిగే అవకాశం ఉన్నదని అన్నారు.శనివారం రాత్రి ఇదే సంఘటన జరిగిన సందర్భం ఉందని అన్నారు.అలాగే ప్రయాణికులు త్రాగడానికి నీళ్ళు కూడా లేని పరిస్థితి ఉన్నదనిఅన్నారు.మరుగుదొడ్లు కూడా వాడుకలో లేని పరిస్థితనిఅన్నారు.ప్రభుత్వం,అధికారులు ఆలోచించి ప్రజలు,ప్రయాణికుల సమస్యలు గుర్తించి జమ్మలమడుగు రైల్వే స్టేషన్ లో సమస్యలు

పరిష్కరించాలని కోరుతున్నామన్నారు.సమావేశంలో జిల్లాకమిటీ సభ్యులు ప్రసాద్,పట్టణ నాయకులు అరుణ్ పాల్గొన్నారు.

# హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భద్రాచలంలో ఉచిత క్రికెట్ సమ్మర్ కోచింగ్ క్యాంపు ప్రారంభం



భద్రాచలం (తెలుగు గళం): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భద్రాచలం జూనియర్ కళాశాల మైదానంలోని చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీలో ఉచిత క్రికెట్ సమ్మర్ కోచింగ్ క్యాంపును ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్ ఐఏఎస్ మరియు హెచ్‌సీఏ ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శి చెరుకూరి వెంకట్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతానికి చెందిన యువ క్రీడాకారులు క్రికెట్‌లో ప్రతిభ కనబర్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ దాగి ఉందని, సరైన శిక్షణతో వారు ఉన్నత స్థాయికి చేరుకోగలరని పేర్కొన్నారు.

హెచ్‌సీఏ ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శి చెరుకూరి వెంకట్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగి ఉన్న క్రికెట్ ప్రతిభను వెలికితీసి ఉన్నత శిఖరాలకు చేర్చడమే హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ లక్ష్యమని తెలిపారు. భద్రాచలం ఏజెన్సీ ప్రాంత యువత ఈ ఉచిత కోచింగ్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు.

ఈ ఉచిత క్రికెట్ సమ్మర్ కోచింగ్ క్యాంపులో కోచ్‌లుగా కుప్పాల చరణ్ తేజ, రవితేజ, శ్రీకాంత్ శిక్షణ అందిస్తారని తెలిపారు.

కార్యక్రమ ప్రారంభానికి గుర్తుగా ఐటీడీఏ పీవో రాహుల్ బ్యాటింగ్ చేయగా, హెచ్‌సీఏ కార్యదర్శి చెరుకూరి వెంకట్ బౌలింగ్ చేసి క్యాంపును అధికారికంగా ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, తల్లిదండ్రులు, అకాడమీ ప్రతినిధులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

# పాయకరావుపేటలో మహానాడు ఏర్పాట్లు

## పరిశీలించిన హోం మంత్రి అనిత.



నక్కపల్లి, మే 24(తెలుగు గళం):- హోం మంత్రి వంగలపూడి అనిత పాయకరావుపేట నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేశారు. మే 27, 28 తేదీల్లో హైబ్రిడ్ విధానంలో జరగనున్న టీడీపీ మహానాడు కార్యక్రమానికి సంబంధించి కళ్యాణ మండపాలు, సభా ప్రాంగణాలు మరియు ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాల్లో మహానాడు నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై స్థానిక నాయకులతో సమీక్ష నిర్వహించిన మంత్రి అనిత, క్లస్టర్ స్థాయిలో జరగనున్న మహానాడును విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇదే సందర్భంగా పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎస్.రాయవరం మండలం పెదగుమ్ములూరులో రుద్ర లక్ష్మి, సాయి శంకర్ కుటుంబాలను స్వయంగా వారి నివాసానికి వెళ్లి పరామర్శించి చెక్కులను అందజేశారు.

### నక్కపల్లిలో మహానాడు పోస్టర్ ఆవిష్కరణ

నక్కపల్లిలోని మంత్రి నివాసం వద్ద మహానాడు పోస్టర్‌ను హోం మంత్రి అనిత ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, "టీడీపీ కుటుంబ సభ్యులు జరుపుకునే అతిపెద్ద పండుగ మహానాడు" అని పేర్కొన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా పార్టీ ఆన్‌లైన్‌లో మహానాడు నిర్వహించిందని గుర్తుచేసిన ఆమె, ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు పొదుపు చర్యల్లో భాగంగా ఈసారి కూడా హైబ్రిడ్ విధానాన్ని అవలంబిస్తున్నామని తెలిపారు.

### రాష్ట్రవ్యాప్తంగా 1,840 క్లస్టర్లలో మహానాడు

సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ తమ కాన్వాయ్‌లలో 50 శాతం వాహనాలను తగ్గించారని, అదే విధంగా మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఖర్చు తగ్గింపునకు చర్యలు తీసుకుంటున్నారని మంత్రి అనిత వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,840 క్లస్టర్లలో మహానాడు నిర్వహిస్తున్నామని, పాయకరావుపేట నియోజకవర్గంలో 10 ప్రాంతాల్లో మహానాడు జరగనుందని తెలిపారు. మే 27, 28 తేదీల్లో రోజుకు ఆరు గంటల పాటు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

### ఎన్టీఆర్ స్థాపించిన పార్టీ కోసం పనిచేయడం పూర్వజన్మ సుకృతం

నందమూరి తారక రామారావు స్థాపించిన పార్టీలో పనిచేయడం తన పూర్వజన్మ సుకృతమని మంత్రి అనిత పేర్కొన్నారు. రెండోసారి పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలిగా ఎంపిక కావడం తన అదృష్టమని చెప్పారు.

పాయకరావుపేట నియోజకవర్గానికి స్టీల్ ప్లాంట్ రాక గర్వకారణమని, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం చేస్తున్నామని తెలిపారు.


### వైసీపీ నాయకులు రాజకీయాలు చేస్తున్నారు

పాయకరావుపేట నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని మంత్రి అనిత పేర్కొన్నారు. రెవెన్యూ డివిజన్, కోర్టు మంజూరు వంటి అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు.

ఇటీవల జరిగిన ఘటనలపై స్పందిస్తూ, "రెండు రోజులుగా వైసీపీ నాయకులు నన్ను బద్నాం చేయాలని ప్రయత్నిస్తున్నారు. 11 ఏళ్ల దళిత బాలిక ఘటనపై రాజకీయాలు చేస్తున్నారన్నారు.

పాయకరావుపేట సీఐ నుంచి సమాచారం అందిన వెంటనే విచారణకు ఆదేశించామని, ఎవరినీ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. "అత్యాచారం జరిగిందని పోలీసులు నిర్ధారించారా? వైద్యులు నిర్ధారించారా?" అంటూ ప్రశ్నించిన మంత్రి, "మీ ఇళ్లల్లో కూడా ఆడపిల్లలు ఉన్నారు... ఆలోచనలు మారాలి" అని వ్యాఖ్యానించారు.

# వేసవిలో డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండాలంటే తప్పనిసరిగా పాటించాల్సిన సూచనలు



హెల్త్ న్యూస్, 24 మే (తెలుగు గళం): దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో డీహైడ్రేషన్ సమస్యలు కూడా అధికమవుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చాలామంది రోజంతా నీళ్లు తాగుతున్నప్పటికీ శరీరంలో నీటి కొరత లక్షణాలు కనిపిస్తూనే ఉంటాయని చెబుతున్నారు. ముఖ్యంగా వేసవిలో అధిక చెమట వల్ల శరీరం నుంచి నీటితో పాటు అవసరమైన ఖనిజాలు కూడా బయటకు వెళ్లిపోతాయి. దీంతో కేవలం నీరు తాగడం సరిపోకపోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. శరీరంలో తగినంత ద్రవాలు లేకపోతే మొదట కనిపించే లక్షణాల్లో అలసట ఒకటి. సరైన విశ్రాంతి తీసుకున్నప్పటికీ రోజంతా బలహీనంగా, నీరసంగా అనిపిస్తే అది డీహైడ్రేషన్ సంకేతంగా భావించాల్సి ఉంటుంది. శరీరంలో నీటి స్థాయిలు తగ్గిపోతే రక్తప్రసరణ మందగించి, ఆక్సిజన్, పోషకాలు శరీర భాగాలకు సరిగ్గా చేరవు. దీంతో శక్తి తగ్గి అలసట పెరుగుతుంది.

తరచూ తలనొప్పి వస్తుంటే..

వేసవిలో తరచూ తలనొప్పి రావడం కూడా డీహైడ్రేషన్‌కు సంకేతమని నిపుణులు చెబుతున్నారు. శరీరంలో ద్రవ సమతుల్యత దెబ్బతింటే రక్తప్రసరణలో మార్పులు వచ్చి తలనొప్పి వచ్చే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా ఎండలో ఎక్కువసేపు తిరిగిన తర్వాత వచ్చే తలనొప్పిని నిర్లక్ష్యం చేయొద్దని సూచిస్తున్నారు. మూత్రం గాఢ పసుపు రంగులో కనిపించడం లేదా సాధారణం కంటే తక్కువసార్లు మూత్ర విసర్జన జరగడం కూడా శరీరంలో నీటి కొరతకు సూచనగా భావించాలి. శరీరం నీటిని ఆదా చేసేందుకు ప్రయత్నించే సమయంలో మూత్రం మరింత కేంద్రీకృతమై ముదురు రంగులో కనిపిస్తుంది. నిపుణుల ప్రకారం మూత్రం రంగు ద్వారా శరీర హైడ్రేషన్ స్థాయిని సులభంగా అంచనా వేయవచ్చు. ఏకాగ్రత తగ్గడం, మతిమరుపు, మెదడు మందగించినట్లు అనిపించడం కూడా డీహైడ్రేషన్ వల్ల కలిగే సమస్యలలో ఒకటి. శరీరంలో నీటి శాతం స్వల్పంగా తగ్గినా మెదడు పనితీరుపై ప్రభావం పడుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. దృష్టి కేంద్రీకరించడంలో ఇబ్బంది, స్పందన మందగించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

నీళ్లు తాగుతున్నా దాహంగా ఉంటే..

చాలా నీళ్లు తాగుతున్నప్పటికీ దాహంగా అనిపించడం లేదా శరీరంలో బలహీనత తగ్గకపోవడం కూడా ఎలక్ట్రోలైట్ అసమతుల్యతకు సంకేతం అయ్యే అవకాశాలు ఉంటాయి. వేసవిలో చెమట ద్వారా సోడియం, పొటాషియం వంటి ఖనిజాలు బయటకు వెళ్లిపోతాయి. కేవలం నీరు తాగడం వల్ల ఇవి తిరిగి భర్తీ కావు. అందుకే కొబ్బరి నీరు, ఓఆర్ఎస్ వంటి ఎలక్ట్రోలైట్ పానీయాలను కూడా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. తీవ్రమైన ఎండల సమయంలో శరీరం చెమట ద్వారా ఉష్ణోగ్రతను నియంత్రించేందుకు ఎక్కువగా పనిచేస్తుంది. ఈ ప్రక్రియలో నీరు, ఖనిజాలను వేగంగా కోల్పోతుంది. ఇవి సకాలంలో భర్తీ కాకపోతే డీహైడ్రేషన్ సమస్య క్రమంగా తీవ్రమవుతుంది. నిర్లక్ష్యం చేస్తే కిడ్నీలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

ఆహారంపైనా దృష్టి అవసరం..

వేసవిలో సరైన హైడ్రేషన్ కోసం నీటితోపాటు ఆహారంపైనా దృష్టి పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. దోసకాయ, టమాటాలు, లెట్యూస్ వంటి నీటి శాతం అధికంగా ఉండే కూరగాయలు తీసుకోవాలని చెబుతున్నారు. పుచ్చకాయ, తర్బూజా వంటి పండ్లు శరీరాన్ని చల్లబరచడంలో సహాయపడతాయని పేర్కొంటున్నారు. నారింజలు ఎలక్ట్రోలైట్ సమతుల్యతకు ఉపయోగపడతాయని, ద్రాక్ష శరీరానికి తేమను అందించడంలో సహాయపడుతుందని తెలిపారు. అలాగే కార్బొనేటెడ్ శీతల పానీయాలు, అధిక చక్కెర కలిగిన డ్రింక్స్‌పై ఆధారపడొద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇవి శరీరంలో నీటి కొరతను మరింత పెంచే అవకాశం ఉందని చెబుతున్నారు. రోజంతా కొద్దికొద్దిగా నీరు తాగడం, ఎక్కువసేపు దాహంగా ఉండకుండా చూసుకోవడం, కొబ్బరి నీరు లేదా ఓఆర్ఎస్ వంటి పానీయాలను తీసుకోవడం ద్వారా వేసవిలో డీహైడ్రేషన్ సమస్యను దూరంగా ఉంచవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# వేసవిలో రోజూ పెరుగన్నం తినండి.. ఎన్నో అద్భుతమైన లాభాలను పొందవచ్చు



హెల్త్ న్యూస్, 24 మే (తెలుగు గళం): వేసవికాలంలో శరీరానికి చల్లదనం ఇచ్చే ఆహారాలను తీసుకోవడానికి ప్రజలు ఎక్కువగా ఇష్టపడతారు. అలాంటి ఆహారాల్లో పెరుగన్నం ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. తేలికగా జీర్ణమయ్యే ఈ సంప్రదాయ వంటకం వేడికాలంలో శరీరానికి ఉపశమనం కలిగించడమే కాకుండా పొట్టకు కూడా హాయిని ఇస్తుంది. అయితే రెండు వారాల పాటు ప్రతిరోజూ పెరుగన్నం తింటే శరీరంలో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయో తెలుసుకోవాలనే ఆసక్తి చాలామందిలో ఉంటుంది. నిపుణుల ప్రకారం, ఇది జీర్ణక్రియ నుంచి హైడ్రేషన్ వరకు పలు ప్రయోజనాలను అందిస్తుందని చెబుతున్నారు. పెరుగులో ఉండే ప్రోబయోటిక్స్ ఆరోగ్యకరమైన గట్ (జీర్ణ వ్యవస్థ) బ్యాక్టీరియాను పెంచడంలో సహాయపడతాయి. అందువల్ల పెరుగన్నం తరచూ తింటే జీర్ణక్రియ మెరుగుపడటంతోపాటు కడుపు ఉబ్బరం, ఆమ్లత్వం వంటి సమస్యలు తగ్గే అవకాశం ఉంటుంది. అన్నం మృదువుగా ఉండటం వల్ల వేసవిలో సులభంగా జీర్ణమవుతుంది. ఫెర్మెంటెడ్ ఫుడ్స్‌ను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవడం గట్ ఆరోగ్యాన్ని బలోపేతం చేస్తుందని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.

వేసవి సమస్యలను తగ్గిస్తుంది..

పెరుగన్నం సహజసిద్ధంగా శరీరానికి చల్లదనం అందించే ఆహారం. పెరుగులో నీటి శాతం ఎక్కువగా ఉండటంతోపాటు పొటాషియం వంటి ఎలక్ట్రోలైట్స్ కూడా ఉంటాయి. ఇవి శరీరంలో ద్రవాల సమతుల్యతను కాపాడటంలో సహాయపడతాయి. వేసవిలో డీహైడ్రేషన్, అలసట సమస్యలను తగ్గించడంలో పెరుగన్నం ఉపయోగపడుతుందని చెబుతున్నారు. దోసకాయ, కరివేపాకు వంటి పదార్థాలు కలిపితే మరింత చల్లదనం లభిస్తుంది. అంతేకాకుండా అధిక మసాలా లేదా నూనెతో చేసిన వంటకాలతో పోలిస్తే పెరుగన్నం తేలికగా ఉంటుంది. అన్నంలో కార్బోహైడ్రేట్లు ఉండటం వల్ల శరీరానికి శక్తి లభిస్తుంది. పెరుగులో ఉండే కొద్దిపాటి ప్రోటీన్, కొవ్వు కలిసి ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలిగిస్తాయి. దీనివల్ల మధ్యాహ్న సమయంలో అలసట తగ్గి శక్తి స్థాయిలు స్థిరంగా ఉండే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

రోగ నిరోధక శక్తికి..

పెరుగులోని ప్రోబయోటిక్స్ రోగనిరోధక శక్తిని కూడా బలోపేతం చేయడంలో సహాయపడతాయని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. గట్ ఆరోగ్యం మెరుగుపడితే శరీర రక్షణ వ్యవస్థ కూడా మెరుగ్గా పనిచేస్తుందని చెబుతున్నారు. రెండు వారాల వ్యవధిలోనే కొంతమేర జీర్ణ సమస్యలు తగ్గినట్లు చాలామంది గమనించే అవకాశం ఉందని వివరిస్తున్నారు. అయితే ప్రతిరోజూ పెరుగన్నమే తినడం వల్ల పోషకాల వైవిధ్యం తగ్గే ప్రమాదం కూడా ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పెరుగన్నంలో ఐరన్, ఫైబర్ వంటి కొన్ని పోషకాలు తక్కువగా ఉంటాయి. కాబట్టి కూరగాయలు, పప్పులు, పండ్లు వంటి ఇతర ఆహారాలను కూడా సమతులంగా తీసుకోవడం అవసరం. క్యారెట్ తురుము, దానిమ్మ గింజలు, వేయించిన గింజలు కలిపి తింటే ఈ వంటకం మరింత పోషకవంతంగా మారుతుంది.

బరువు తగ్గేందుకు..

ఇక పెరుగన్నాన్ని సరైన మోతాదులో తీసుకుంటే బరువు నియంత్రణకు కూడా ఉపయోగపడుతుంది. ఇది ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉంచి మధ్యలో అనవసరమైన స్నాక్స్ తినే అలవాటును తగ్గిస్తుంది. అయితే అన్నం ఎక్కువగా తీసుకుంటే క్యాలరీలు పెరిగే అవకాశం ఉండటంతో పరిమిత మోతాదులో తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. వేసవిలో రెండు వారాల పాటు పెరుగన్నం తీసుకోవడం వల్ల శరీరానికి చల్లదనం, జీర్ణక్రియలో మెరుగుదల, తేలికైన అనుభూతి వంటి ప్రయోజనాలు కలిగే అవకాశం ఉంటుంది. అయితే సమతుల ఆహారంతోపాటు ఇతర పోషకాలు కూడా అందేలా జాగ్రత్తపడితేనే పూర్తి ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు.

## అల్లు అర్జున్-బాసిల్ జోసెఫ్ మూవీ

# 'శక్తిమాన్' కాదు



టాలీవుడ్‌లో సరికొత్త రికార్డులు సృష్టిస్తున్న అల్లు అర్జున్.. 'పుష్ప 2' తర్వాత ఇతర భాషల స్టార్ డైరెక్టర్లతో పని చేయడానికి లైన్ క్లియర్ చేసుకుంటున్నారు. ఇప్పటికే కోలీవుడ్ మాస్ డైరెక్టర్ అట్లీ తో సినిమా కన్ఫర్మ్ కాగా.. 'మిన్నల్ మురళి చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న మలయాళ దర్శకుడు బాసిల్ జోసెఫ్‌తో కూడా బన్నీ ఒక భారీ ప్రాజెక్ట్ చేయబోతున్నారు. అయితే, ఈ ప్రాజెక్ట్ 'శక్తిమాన్' రీమేక్ అంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదని మేకర్స్ స్పష్టం చేశారు. బాసిల్ జోసెఫ్,అల్లు అర్జున్ కాంబో మూవీపై బాలీవుడ్ అండ్ టాలీవుడ్ మీడియాలో వస్తున్న ఊహాగానాలకు స్క్రిప్ట్ రైటర్, డైరెక్టర్ అరుణ్ అనిరుధన్ చెక్ పెట్టారు.

అరుణ్ అనిరుధన్ క్లారిటీ ఇస్తూ.. తాము రాసుకున్న 'శక్తిమాన్' కథ పక్కన పెట్టేసామని, అల్లు అర్జున్ కోసం బాసిల్ జోసెఫ్ సిద్ధం చేస్తున్న కథ పూర్తిగా భిన్నమైనదని స్పష్టం చేశారు. ఈ సినిమా జోనర్.. కథాంశం కి సంబంధించిన ఫైనల్ డిస్కషన్స్ ప్రస్తుతం జరుగుతున్నాయి. అయితే ఇటీవల జరిగిన మెగా అల్లు వారసుడు అల్లు శిరీష్వివాహ వేడుకకు దర్శకుడు బాసిల్ జోసెఫ్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. కేవలం మర్యాదపూర్వకంగానే కాకుండా.. ఈ పెళ్లి వేడుకల సమయంలోనే అల్లు అర్జున్, బాసిల్ జోసెఫ్ పలుమార్లు భేటీ అయి కథా చర్చలు జరిపినట్లు ఫిలిం నగర్ వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రాజెక్ట్‌ను గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మించబోతున్నట్లు సమాచారం

# అంజలి ఖాతాలో బంపర్ ఆఫర్



హీరోయిన్ అంజలి తన అద్భుతమైన నటనతో, హోమ్లీ లుక్స్‌తో ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి మెప్పించిన ఈ బ్యూటీ, ప్రస్తుతం కూడా క్రేజీ ప్రాజెక్టులతో వరుస సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉంది. గత ఏడాది విడుదలైన 'మదగజరాజా' మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న అంజలి, తాజాగా ఒక బంపర్ ఆఫర్ దక్కించుకున్నట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు వైరల్ అవుతున్నాయి. తాజా .. సమాచారం ప్రకారం.. అంజలి తన కెరీర్ ఆరంభంలో జతకట్టిన ఓ హీరో సరసన మరోసారి రొమాన్స్ చేయబోతోంది. కోలీవుడ్ టాలెంటెడ్ హీరో జీవా, అంజలి కాంబినేషన్‌లో గత 2007 లో వచ్చిన 'కత్రదు తమిజ్' (తెలుగులో 'కళాశాల రఘురామ్') సినిమా ఎంతటి సంచలన విజయం సాధించిందో అందరికీ తెలిసిందే. ఆ మూవీలో వీరిద్దరి నటనకు, కెమిస్ట్రీకి ప్రేక్షకులు ఫిదా అయిపోయారు. దాదాపు 19 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఈ హిట్ పెయిర్ మళ్లీ ఒకే స్క్రీన్‌పై కనిపించబోతుండటంతో అటు అభిమానుల్లో, ఇటు ప్రేక్షకుల్లో భారీ అంచనాలు, ఆసక్తి నెలకొన్నాయి. ఈ క్రేజీ లవ్ అండ్ రొమాంటిక్ డ్రామాకు వైవిధ్యమైన చిత్రాల దర్శకుడు వసంత బాలన్ దర్శకత్వం వహించబోతున్నారు. వైవిధ్యమైన కథలను తెరకెక్కించడంలో ఆయన రూటే సెపరేట్. ఇక ఈ సినిమాను కన్నన్ రవి గ్రూప్స్ సంస్థ ఎంతో ప్రతిష్టాత్మకంగా, భారీ బడ్జెట్‌తో నిర్మించనుంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన కథా చర్చలు ఇప్పటికే ముగిశాయని, త్వరలోనే అధికారిక ప్రకటనతో పాటు పూజా కార్యక్రమాలతో సినిమాను పట్టాలెక్కించబోతున్నట్లు తెలుస్తోంది.

# 'డిక్యూ41' క్రేజీ అప్‌డేట్..!

మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ బ్యాక్ టు బ్యాక్ క్రేజీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా గడుపుతున్నారు. మలయాళంతో పాటు టాలీవుడ్‌లోనూ వరుస హిట్లు అందుకుంటూ తెలుగు ప్రేక్షకుల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్, గ్లామర్ బ్యూటీ పూజా హెగ్డే కాంబినేషన్‌లో ఒక భారీ పాన్-ఇండియా లవ్ స్టోరీ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. 'డిక్యూ41' అనే వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది చిత్ర నిర్మాణ సంస్థ SLV సినిమాస్ తమ ట్విట్టర్ ద్వారా చిత్రానికి సంబంధించిన తాజా అప్‌డేట్‌ను పంచుకుంది. ఈ సినిమాకు సంబంధించిన ఒక ముఖ్యమైన, భారీ షెడ్యూల్ విజయవంతంగా పూర్తయినట్లు మేకర్స్ ప్రకటించారు. హిమాలయాల నేపథ్యంలో సాగిన ఈ షెడ్యూల్‌లో హీరో హీరోయిన్లపై కొన్ని అత్యంత కీలకమైన సన్నివేశాలను చిత్రీకరించినట్లు తెలిపారు.

దీనికి సంబంధించిన తదుపరి షెడ్యూల్ చాలా త్వరలోనే ప్రారంభం కానుందని చెబుతూ.. సినిమా అఫీషియల్ టైటిల్ ప్రకటన కోసం కొద్దిరోజులు వేచి చూడాలంటూ ట్వీట్ చేశారు. ఈ క్రేజీ అప్‌డేట్‌తో మెగా లవ్ స్టోరీపై అంచనాలు మరింత పెరిగాయి. ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి రవి నేలకుదిటి దర్శకత్వం వహిస్తుండగా.. టాలెంటెడ్ ప్రొడ్యూసర్ సుధాకర్ చెరుకూరి తన ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ బ్యానర్‌కు ఇది 10వ (SLVC10) మైల్‌స్టోన్ ప్రాజెక్ట్ కావడం విశేషం. ఈ సినిమాలో కేవలం దుల్కర్-పూజా కెమిస్ట్రీ మాత్రమే కాకుండా.. సీనియర్ నటుడు జగపతి బాబు, వర్సటైల్ యాక్ట్రెస్ రమ్యకృష్ణ, 'దసరా' ఫేమ్ దీక్షిత్ శెట్టి కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. నేషనల్ అవార్డ్ విన్నర్ జి.వి. ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు.



# యూట్యూబ్‌ను షేక్ చేస్తున్న 'పెద్ది' ఐటెం సాంగ్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'పెద్ది'. గత కొద్ది కాలంగా ఎక్కడ చూసినా ఈ సినిమా గురించే చర్చించుకుంటున్నారు. ఇన్నాళ్లు వాయిదా పడుతూ వచ్చిన 'పెద్ది' జూన్ 4న థియేటర్స్‌లోకి రాబోతుండటంతో చిత్రబృందం ప్రమోషన్స్‌లో ఫుల్ బిజీగా ఉన్నారు. ఇక ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్ అంచనాలను పెంచగా.. ఇప్పుడు ఓ మాస్ సాంగ్ విడుదల కాగా.. యూట్యూబ్‌ను షేక్ చేస్తోంది. చీర చొక్క.. చిక్కెడిపోవాలో అంటూ సాగే ఈ పాటలో రామ్ చరణ్ సరసన శృతి హాసన్‌తో పాటుగా ఇందులో హీరోయిన్‌గా చేసిన జాన్వీ కపూర్ కూడా చిందులేసింది. ముగ్గురు స్టార్ల డ్యాన్స్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంది. అనంత శ్రీరామ్ రాసిన ఈ పాటను రక్షిత సురేష్ అద్భుతంగా పాడారు. ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ సంగీతం అందించగా.. బుచ్చిబాబు సనా దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో జగపతి బాబు, దివ్యేందు శర్మ, శివరాజ్ కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తుండగా.. ఇప్పటికే 'పెద్ది'పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

# చిరు పోడ్‌కాస్ట్



మెగాస్టార్ చిరంజీవి గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన ఆయన ఒక్కో మెట్టు ఎక్కుతూ స్టార్ హీరో స్థాయికి చేరుకోవడమే కాకుండా ఇప్పటికీ అదే స్థాయిలో తన కెరీర్‌ను కొనసాగిస్తున్నారు. చిరంజీవి సుదీర్ఘ సినీ ప్రయాణం, ఆయన ఎదుర్కొన్న ఎత్తుపల్లాల గురించి కొంతవరకు ప్రజలకు తెలిసిందే. అయితే తన జీవితంలోని ఎన్నో ఆసక్తికర విషయాల గురించి చిరంజీవి త్వరలో ఓపెన్ కాబోతున్నట్లు తెలుస్తోంది.

తాజాగా దర్శకుడు, కథా రచయిత బి.వి.ఎస్. రవి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. చిరంజీవి తన సుదీర్ఘ సినీ ప్రయాణం, ఎదుర్కొన్న ఎత్తుపల్లాలు, సంతోషాలు, వ్యక్తిగత అనుభవాలు వంటి అనేక విషయాలను ప్రజలతో పంచుకోవాలని భావిస్తున్నట్లు తెలిపారు. అందుకోసం 'చిరు పోడ్‌కాస్ట్' పేరుతో ఓ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు, అది త్వరలోనే స్టార్ట్ కానున్నట్లు రవి వెల్లడించారు. ఈ పోడ్‌కాస్ట్‌లో చిరంజీవి తన సినీ ప్రస్థానంలో జరిగిన ఎన్నో ఆసక్తికర సంఘటనలు, తెలియని విషయాలను అభిమానులతో పంచుకోనున్నట్లు చెప్పారు. ఇలా చిరంజీవి తన జీవిత విశేషాలను చెప్పేందుకు ప్రత్యేకంగా పోడ్‌కాస్ట్ షో నిర్వహించబోతున్నారనే వార్త బయటకు రావడంతో, మెగా అభిమానులు దీనిపై భారీ ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.